ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -311 పేజీలు - 08 వెల - 04/-

ఆదివారం 28 సెప్టెంబర్ 2025

# హీరో విజయ్ సభలో తొక్కిసలాట



## 38 మంది మృతి

వీరిలో ఆరుగురు చిన్నారులు,

-తమిళనాట విషాదం

16 మంది మహిళలు

వందలాదిమందికి గాయాలు



**కరూర్ :, సెప్టెంబర్ 27 ఆంధ్ర ప్రగతి**

ప్రముఖ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ర్యాలీలో విషాదం చోటు చేసుకుంది. శనివారం కరూర్‌లో జరిగిన ర్యాలీకి భారీఎత్తున ప్రజలు హాజరయ్యారు. కిక్కిరిసిన ఆ జన సందోహాన్ని ఉద్దేశించి విజరు ప్రసంగిస్తుండగా, తీవ్రంగా తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో 36 మంది మరణిం చారని అధికారులు తెలిపారు. మృతుల్లో ఆరుగురు చిన్నారులు, 16 మంది మహిళలు, 11 మంది పురుషులు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విజయ్ సాగిస్తున్న పర్యటనలో భాగంగా కరూర్‌లోని వేలుచామిపురంలో శనివారం నిర్వహించిన బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు సభ నిర్వహించేందుకు పోలీసులు అనుమతించగా.. విజయ్ సాయంత్రం 6 గంటలకు చేరుకున్నారు. కరూర్‌తోపాటు సమీపంలోని మూడు జిల్లాల నుంచి వచ్చిన విజయ్ అభిమానులు, మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలు, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన పార్టీ స్వచ్ఛంద కార్యకర్తలు దాదాపు ఆరుగంటలపాటు ఎండలో వేచి ఉన్నారు. ప్రజలు ఎక్కువగా, కిక్కిరిసిపోయి వుండడం, వేడిగా ఉండడంతో సభ జరుగుతుండగానే అనేకమంది ఊపిరాడక కండ్లు తిరిగి పడిపోయినట్టు తెలుస్తోంది.

మిగతా 2లో.

# ఎపిలో పర్యాటక అభివృద్ధికి పెద్దపీట

- పర్యాటకంతో ఎన్నో దేశాలు అభివృద్ధి
- మనదేశంలో ఆకర్శణీయమైన పర్యాటక కేంద్రాలు
- పర్యాటకం గేమ్ ఛేంజర్ అన్న సిఎం చంద్రబాబు




విజయవాడ, **సెప్టెంబర్ 27 ఆంధ్ర ప్రగతి** ప్రస్తుతం కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలో టూరిజం కీలకంగా మారిందని, టూరిజాన్ని నమ్ముకునే అభివృద్ధి చెందుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. టూరిజం వల్ల ఏజెన్సీలోనూ అనేక మంది ఉపాధి పొందుతున్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చాం.. ఇది గేమ్ ఛేంజర్. పర్యాటక ప్రాజెక్టులకు ప్రత్యేక ప్యాకేజీలు, రాయితీలు ఇస్తున్నామని అన్నారు. మిగతా 2లో...

# ఏపీ పర్యటనకు మోదీ...

### చంద్రబాబు, పవన్‌తో కర్నూలులో భారీ ర్యాలీ

- అక్టోబర్ 16న ఆంధ్రప్రదేశ్‌కు రానున్న ప్రధాని మోదీ
- కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రధాని పర్యటన
- శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకోనున్న ప్రధాని



2లో.

# 23 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం

ఏపీ అసెంబ్లీ నిరవధిక వాయిదా...

మొత్తం 46 గంటల పాటు సాగిన చర్చలు

మూడు బిల్లులను ఉపసంహరించుకున్న ప్రభుత్వం

సమావేశాలకు గైర్హాజరైన ప్రతిపక్ష నేత జగన్



**అమరావతి, సెప్టెంబర్ 27 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ముగిశాయి. ఎనిమిది రోజుల పాటు జరిగిన ఈ సమావేశాల అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ వి. అయ్యన్న పాత్రుడు శనివారం ప్రకటించారు. ఈ సెషన్‌లో మొత్తం 23 బిల్లులను సభ ఏకగ్రీవంగా ఆమోదించడం విశేషం. మిగతా 2లో...

# అక్టోబరు 4న ఆర్థికసాయం

- ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15 వేల ఆర్థిక సాయం
- అక్టోబరు 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు నగదు జమ
- రాష్ట్రవ్యాప్తంగా 2.9 లక్షల మంది డ్రైవర్లకు ప్రయోజనం
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన
- అర్హులైన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని ప్రభుత్వం హామీ
- పెండింగ్ చలాన్లు క్లియర్ చేసుకున్న వారికే వర్తింపు



2లో.

# పేరెంట్స్‌ను నిర్లక్ష్యం చేయొద్దు

### : గ్రూప్-1 అభ్యర్థులకు నియామకపత్రాల కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

ఉద్యోగుల జీతంలో 10 శాతం తల్లిదండ్రుల ఖాతాల్లోకి

-త్వరలో చట్టం తెస్తాంపదేండ్ల పాలకులు విశ్వాసఘాతకులు

మేథోశక్తిని చాటాలి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్ , **సెప్టెంబర్ 27 ఆంధ్ర ప్రగతి**

'పిల్లల చదువులు, ఉద్యోగాల సాధన కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడతారు. అవసరమైన డబ్బులు ఇస్తూ, వారి భవిష్యత్ కోసం సర్వం త్యాగం చేస్తారు. ఉద్యోగం వచ్చాక తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దు. అలా చేస్తే ఉద్యోగుల జీతంలో పది శాతం కోత విధించి, పేరెంట్స్ ఖాతాల్లో వేస్తాం. దీనిపై త్వరలోనే చట్టం తెస్తాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

మిగతా 2లో.

# కాంగ్రెస్ బాకీ కార్డ్ ఉద్యమం

ఆ పార్టీ మోసాలను వివరించేందుకే

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




2లో.

# హైదరాబాద్ వరద బాధితులకు అండగా నిలవండి..

జనసేన శ్రేణులకు, అభిమానులకు పవన్ పిలుపు



2లో.

# దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్‌వర్క్...

- ఒడిశాలో లాంఛనంగా సేవలను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ
- టీసీఎస్, సీ-డాట్, తేజస్ నెట్‌వర్క్స్‌తో కలిసి పూర్తి దేశీయంగా రూపకల్పన
- 26,700 మారుమూల గ్రామాలకు అందనున్న హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు



2లో.

# మూసీ ఉగ్రరూపం

### వరద నీటిలో ఎంజీబీఎస్.. బస్సుల రాకపోకలు నిలిపివేత

హైదరాబాద్, **సెప్టెంబర్ 27 ఆంధ్ర ప్రగతి**



మూసీ నది హైదరాబాద్‌ను అతలాకుతలం చేసింది. శుక్రవారం రాత్రి ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగిపోవటంతో మూసీ నదికి ఇరువైపు లా ఉన్న కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. ఎన్నడూ లేనివిధంగా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌ను వరద ముంచెత్తింది. మిగతా 2లో...

# హీరో విజయ్ సభలో తొక్కిసలాట

అభిమానుల్లో కొంతమంది తమ నటుడిని దగ్గర నుంచి చూడాలనే ఉద్దేశంతో బస్సు సమీపంలోకి వెళ్లడానికి ప్రయత్నించడంతో తొక్కిసలాట మొదలైనట్టు అధికారులు చెబుతున్నారు. వీరిని వెంటనే కరూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, సమీపంలోని ప్రయివేటు ఆస్పత్రులకు హుటాహుటిన తరలించారు. 500మందికి పైగా ఇప్పటికే ఆస్పత్రుల్లో చేరినట్టు తెలుస్తోంది. మరో 400మందికి పైగా తీసుకువస్తున్నారని సీనియర్ పోలీసు అధికారి డేవిడ్సన్ దేవాశీర్వాదం తెలిపారు. తొక్కిసలాట సమాచారం అందడంతో షెడ్యూల్ సమయానికి కన్నా ముందుగానే విజయ్ తన ప్రసంగాన్ని ముగిం చేశారు. అవసరమైన సాయాన్ని యుద్ధ ప్రాతిపదికన అందజేయాల్సిందిగా ఆదేశించారు. మరోపక్క జనాల రద్దీ బాగా వుండడంతో అంబులెన్సులు అవసర మైన చోటుకు వెళ్లడానికి కూడా బాగా సమయం పట్టేసింది.

**ఒక్కొక్కరికి రూ.10 లక్షల నష్టపరిహారం**

కరూర్ తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించింది. ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున సాయం చేస్తామని తమిళనాడు సీఎం స్టాలిన్ చెప్పారు. తనకు తీవ్ర ఆందోళన కలిగిస్తోందని సీఎం స్టాలిన్ అన్నారు. తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారికి రూ.1 లక్ష పరిహారం అందించనున్నట్టు వివరించారు. శనివారం రాత్రి 9.40 గంటలకు సచివాలయానికి వచ్చిన ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆయన కరూర్ వెళ్లనున్నారు.

## 23 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశాలు మొత్తం 8 రోజుల పాటు 45 గంటల 53 నిమిషాల పాటు కొనసాగాయి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, పరిపాలన, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై సభ్యులు చర్చించారు. ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టిన బిల్లులన్నింటికీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదముద్ర వేశారు. అయితే, మరో మూడు బిల్లులను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. వీటితో పాటు ఆరు ముఖ్యమైన అంశాలపై సభలో సుదీర్ఘంగా చర్చ జరిగింది.

సమావేశాల ముగింపు సందర్భంగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ, "సభలో ప్రవేశపెట్టిన అన్ని బిల్లులు ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. ఇప్పుడు సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నాం" అని తెలిపారు.కాగా, ఈ సమావేశాలకు వైసీపీ అధినేత జగన్ హాజరుకాకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక జరిగిన ఈ తొలి సమావేశాలు ఫలవంతంగా ముగిశాయని, తదుపరి సమావేశాల్లో రాష్ట్ర బడ్జెట్‌తో పాటు మరిన్ని కీలక విధానాలపై చర్చించే అవకాశం ఉందని అధికార వర్గాలు అంటున్నాయి.

# ఏపీ పర్యటనకు మోదీ...

## చంద్రబాబు, పవన్‌తో కర్నూలులో భారీ ర్యాలీ

**● అక్టోబర్ 16న ఆంధ్రప్రదేశ్‌కు రానున్న ప్రధాని మోదీ**

అమరావతి, **సెప్టెంబర్ 27 ఆంధ్ర ప్రగతి**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. అక్టోబర్ 16వ తేదీన ఆయన రాష్ట్రానికి రానున్నారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటిస్తారు. తొలుత ఆయన శ్రీశైలం క్షేత్రానికి వెళ్లి మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారు. అనంతరం కర్నూలులో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లతో కలిసి రోడ్‌షో నిర్వహిస్తారు. జీఎస్టీ సంస్కరణల అంశంపై కూటమి నేతలు ముగ్గురూ కలిసి ఈ భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలుస్తోంది.ఈ పర్యటన సందర్భంగా రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కూడా ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఈ వివరాలను మంత్రి నారా లోకేశ్.. శాసనమండలి లాబీలో ఇతర మంత్రులు, ఎమ్మెల్సీలతో మాట్లాడుతూ ప్రస్తావించినట్లు సమాచారం. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# మూసీ ఉగ్రరూపం

(మొదటి పేజీ తరువాయి)

దీంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. వారిని హైడ్రా, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది బయటకు తరలించారు. ముందు జాగ్రత్తగా మూసీ నదిపై ఉన్న లో లెవల్ వంతెనలు మూసేశారు. పురానాపూల్, చాదర్‌ఘాట్, మూసారంబాగ్ కాజ్‌వేలను మూసేశారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మూసీ నదికి భారీ వరద పోటెత్తింది. దీంతో శుక్రవారం రాత్రి అధికారులు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ గేట్లను ముందస్తు హెచ్చరిక చేయకుండానే ఎత్తేయడంతో దిగువన ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగిపోయింది. వెంటనే స్పందించిన హైడ్రా, ఎస్‌డీఆర్‌ఎస్ విభాగాలు.. మూసీ వెంట ఉన్న కాలనీల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అధికారులు, పోలీసులు మూసీ పరీవాహక ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. చాదర్‌ఘాట్ తదితర ప్రాంతాల వరద బాధితులకు హెలికాప్టర్, డ్రోన్ల ద్వారా ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

**మూసీ పరివాహక ప్రాంతాల్లో రెడ్ అలెర్ట్**

మూసీ పరివాహక ప్రాంతాల్లో నీరు చేరుతుందన్న సమాచారంతో రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ పోలీసు శాఖలు అప్రమత్తమయ్యాయి. ముఖ్యంగా చాదర్‌ఘాట్, శంకర్‌నగర్, గోల్నాక డివిజన్ పరిధిలోని కృష్ణానగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రదేశాలకు తరలించారు. పాఠశాల భవనాలు, కమ్యూనిటీ హాల్స్‌ను పునరావాస కేంద్రాలుగా మార్చి బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందిస్తున్నారు. నది ఉధతి పెరగడంతో ముసారంబాగ్ బ్రిడ్జిని మూసేశారు. రాకపోకలను నిలిపేశారు. జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు.

# పేరెంట్స్‌ను నిర్లక్ష్యం చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

శనివారంనాడిక్కడి శిల్పకళావేదికలో గ్రూప్-1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందచేశారు. మొత్తం 563 గ్రూప్-1 పోస్టులకుగాను 562 మంది అభ్యర్థులను టీజీపీఎస్సీ 18 శాఖలకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తెలంగాణ గడ్డకు చరిత్ర, పౌరుషం ఉన్నాయనీ, ఏమారుమూల పల్లె, తండా, గ్రామానికి వెళ్లినా ఆ స్ఫూర్తి కనిపిస్తుందన్నారు. సామాజిక న్యాయం. సమాన అవకాశాల కోసం తెలంగాణలో అనేక పోరాటాలు ఇదే చైతన్యంతో జరిగాయని వివరించారు. పదేండ్లు అధికారంలోఉన్నా, గ్రూప్-1 నోటిఫికేషన్ ఇవ్వకుండా, నిరుద్యోగుల్ని ఏమాత్రం పట్టించుకోకుండా, నిర్లక్ష్యంతో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి నమ్మకద్రోహులుగా మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. ఆరు దశాబ్దాల ఉద్యమాన్ని ఒకే కుటుంబం, ఒకే పార్టీకి ఆపాదించుకోవాలని చూశారనీ, ప్రజలు రెండు సార్లు గెలిపించేసరికి కారణజన్ములమనుకుని విర్రవీగారని విమర్శించారు. అలాంటి విశ్వాసఘాతకులు ఉద్యమకారులు ఎలా అవుతారని ప్రశ్నించారు. పదేండ్ల పాలనలో టీజీపీఎస్సీని అంగడిసరుకుగా మార్చారనీ, దానిలో ఆర్‌ఎంపీ డాక్టర్‌ను సభ్యుడిగా నియమించి, ప్రశ్నాపత్రాలను జిరాక్స్ కేంద్రాల్లో అమ్ముకున్నారని ఆక్షేపించారు.

టీజీపీఎస్సీని యూపీఎస్సీ కంటే మెరుగ్గా తీర్చిదిద్దామనీ, ఉన్నత హోదాల్లో ఉన్న వారిని చైర్మెన్లు, సభ్యులుగా నియమించామని గుర్తు చేశారు. టీజీపీఎస్సీ రాజకీయ పునరావాస కేంద్రం కాదని చెప్పారు. కొందరు కడుపు నిండా విషం పెట్టుకుని అభ్యర్థులను దెబ్బతీయాలనుకున్నారని వ్యాఖ్యానించారు. గ్రూప్-1 పోస్టుల్ని రూ.రెండు కోట్లు, మూడు కోట్లకు అమ్ముకున్నానని తనపై కొందరు ఆరోపణలు చేశారని చెప్పారు. అసలు ఏనాడైనా మీతో కలిసి చారు అయినా తాగానా?అని ప్రశ్నించారు. 2023 డిసెంబర్‌లో కూడా ఇంత ఆందోళన చెందలేదనీ, గ్రూప్-1 నియామకాల విషయంలో ఆందోళన చెందానని అన్నారు. గ్రూప్-1 అభ్యర్థుల భవిష్యత్తే, తెలంగాణ భవిష్యత్ అని చెప్పారు. ఉద్యోగులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి దేశానికే ఆదర్శంగా తెలంగాణ మోడల్‌ను తయారు చేయాలని కోరారు. కోచింగ్ సెంటర్ల కుట్రను అర్థం చేసుకోవాలనీ, హైకోర్టులో వాదించిన న్యాయవాదుల వెనుక ఎవరున్నారో తెలుసుకోవాలన్నారు. 2011లో గ్రూప్-1 నోటిఫికేషన్ వస్తే, 2018లో నియామకాలు జరిగాయని గుర్తు చేశారు. కానీ తాము అధికారంలోకి వచ్చిన 19 నెలల్లో నోటిఫికేషన్ ఇచ్చి, నియామకాలను పూర్తి చేశామన్నారు.

# హైదరాబాద్ వరద బాధితులకు అండగా నిలవండి..

**జనసేన శ్రేణులకు, అభిమానులకు పవన్ పిలుపు**

హైదరాబాద్ , **సెప్టెంబర్ 27 ఆంధ్ర ప్రగతి**

తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొని, బాధితులకు అండగా నిలవాలని తెలంగాణ జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాల కారణంగా జనజీవనం స్తంభించిపోయిందని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా, హైదరాబాద్‌లో మూసీ నదికి వరద పోటెత్తడంతో మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) సహా లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో వరద బాధితులకు మనోధైర్యం కల్పించడం అత్యవసరమని ఆయన అన్నారు.

జనసేన శ్రేణులు తక్షణమే స్పందించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని దిశానిర్దేశం చేశారు. బాధితులకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ వారికి ధైర్యం చెప్పాలని సూచించారు.

ఇదే సమయంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సహాయక చర్యలను ముమ్మరంగా చేపట్టిందని పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం చేస్తున్న సహాయక కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా జనసైనికులు తమ వంతు సాయం అందించాలన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం జారీ చేసే సూచనలతో పాటు వాతావరణ శాఖ హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఏపిలో పర్యాటక అభివృద్ధికి పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ సదస్సులో సీఎం మాట్లాడారు. మా చిన్నప్పుడు గుడికి వెళ్లడమే టూరిజం అనుకునేవాళ్లం. పర్యాటకం విషయంలో ప్రజల ఆలోచనలు మారాయి. ఆ ఇజం.. ఈ ఇజం లేదు.. ఇప్పుడు ప్రతిచోటా టూరిజం. ప్రపంచంలో ఎక్కువ మంది టూరిస్టులు భారత్ నుంచే వెళ్తున్నారు. మన దేశంలో ఉన్న పర్యాటక కేంద్రాలు ప్రపంచంలో మరెక్కడా లేవు. దేశీయ పర్యాటకులను ఆకర్షిస్తే చాలు.. వివిధ రకాల ఆదాయం వస్తుంది. అందరితో చర్చించి మెరుగైన టూరిజం పాలసీ తీసుకొచ్చాం. పర్యాటక కేంద్రాల్లో పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలు జరిగేలా చూడాలి. పర్యాటకులు కొన్ని రోజులు ఉండేలా చూడాలి. ఇప్పుడు వెల్‌నెస్ సెంటర్లకు డిమాండ్ పెరుగుతోంది. పర్యాటక కేంద్రాలను బాగా మార్కెటింగ్ చేసుకోవాలన్నారు. కూచిపూడి, కొండపల్లి, ఏటికొప్పాకను అభివృద్ధి చేస్తాం. గండికోట,

అరకులో ఉత్సవాలు నిర్వహించాం. దసరా అంటే కోల్‌కతా, మైసూరే కాదు.. విజయవాడ కూడా గుర్తుకు రావాలి. దేశంలోనే నెంబర్ వన్ సిటీ-గా విజయవాడ నగరం మారతుంది. రాయలసీమలో టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తున్నాం. మనకు తిరుపతి, శ్రీశైలం, మంత్రాలయం, కాణిపాకం శ్రీకాళహస్తి ఉన్నాయని సీఎం వివరించారు. ఈ సందర్భంగా పర్యాటకశాఖ హోమ్ స్టే పోర్టల్‌ను సీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు కందుల దుర్గేష్, సత్య కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బోండా ఉమా తదితరులు పాల్గొన్నారు. ఏపీలో పర్యాటక రంగానికి స్వర్ణ యుగం లాంటి దశ, దిశను సీఎం చంద్రబాబు కల్పిస్తున్నారని మంత్రి కందుల దుర్గేష్ వ్యాఖ్యానించారు. 15 నెలల కాలంలో పర్యాటక రంగానికి పూర్వ వైభవం వచ్చిందని ఉద్ఘాటించారు. శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఏపీ కార్వాన్ టూరిజం బస్సులను పరిశీలించారు సీఎం. బస్సులో ఉన్న సౌకర్యాలు, వసతులు గురించి సీఎంకు వివరించారు అధికారులు. బస్సులో డైనింగ్ తరహా ఏర్పాట్లు-కూడా ఉంటే బాగుంటుందని సూచించారు సీఎం. ప్రజల అభిప్రాయాలను కూడా తీసుకుని.. అవసరమైతే మార్పులు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ ప్రసంగించారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేలా సీఎం చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని చెప్పుకొచ్చారు. ప్రకృతి అందాలను అభివృద్ధి చేయడం ద్వారా నేడు అద్భుతమైన ప్రదేశాలుగా మారాయని వివరించారు. పర్యాటక రంగంలో సుస్థిరమైన మార్పు వచ్చిందని చెప్పడానికి ఏపీ ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు. క్యాపిటల్, సోషలిజం, కమ్యూనిజం గురించి చాలా మంది మాట్లాడతారని.. కానీ వాటి గురించి మనకు వద్దని.. మనం టూరిజం గురించి మాట్లాడదామని పిలుపునిచ్చిన ఏ-కై-క నాయకులు చంద్రబాబు అని గుర్తుచేశారు మంత్రి కందుల దుర్గేష్. చంద్రబాబు కారణంగా నేడు రూ.10,644 కోట్ల పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కూడా పర్యాటక రంగానికి నిధులు ఇచ్చి సహకరిస్తుందని తెలిపారు. నేడు కొత్త కొత్త పాలసీల విధానాలను తెచ్చి అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అభివృద్ధి చేస్తూ.... సరికొత్త పర్యాటక ప్రాంతాలను ఆవిష్కరిస్తున్నారని చెప్పుకొచ్చారు. కార్వాన్ టూరిజం బస్సుల ప్రత్యేకతలను ఇప్పుడు అందరూ చూశారని తెలిపారు. పర్యాటక శాఖలో ఉన్న అధికారుల టీమ్ సమష్టిగా పని చేస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నారని ప్రశంసించారు. తమ వెనుకాల చంద్రబాబు ఉంటూ.. ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తున్నందుకు ఆయనకు పర్యాటక శాఖ తరపున ధన్యవాదాలు తెలిపారు మంత్రి కందుల దుర్గేష్. ప్రపంచ పర్యాటక దినోత్సవం.. ఇదే రోజు 2000 సంవత్సరంలో చంద్రబాబుతో కలిసి ఆయన ఆలోచనలు పంచుకున్నానని ఐఏఎస్ అధికారి అజయ్ జైన్ గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు 25 ఏళ్ల తర్వాత నేడు మళ్లీ టూరిజం కొత్త పాలసీని ఏపీలో అమలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. ఇప్పుడు చంద్రబాబు ద్వారా టూరిజం గైడ్ లైన్స్‌ను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. పర్యాటక రాష్ట్రంగా అభివృద్ధి చేసేందుకు అనేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని వివరించారు. ఈ ఏడాది ఏపీ వ్యాప్తంగా 8 మెగా ఈవెంట్లు-, ప్రతి జిల్లాలో ఈవెంట్లు-నిర్వహించామని తెలిపారు. టూరిజంలో 20శాతం గ్రోత్ తీసుకురావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని.. అదే లక్ష్యంతో పని చేస్తున్నామని నొక్కిచెప్పారు. దేశవ్యాప్తంగా టూరిజం అభివృద్ధిలో ఏపీ నెంబర్ వన్‌గా ఉండాలనేది తమ టార్గెట్ అని ఐఏఎస్ అధికారి అజయ్ జైన్ పేర్కొన్నారు.

# దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్‌వర్క్..

## ఒడిశాలో లాంఛనంగా సేవలను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ

ఒడిశా, **సెప్టెంబర్ 27 ఆంధ్ర ప్రగతి**

ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్వదేశీ 4జీ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చింది. శనివారం ఒడిశాలోని ఝార్సుగూడలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. పూర్తి భారతీయ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ 'భారత్ టెలికాం స్టాక్' నెట్‌వర్క్‌ను జాతికి అంకితం చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టం ద్వారా టెలికాం రంగంలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం దిశగా దేశం ఒక కీలక మైలురాయిని అధిగమించింది.ఈ కార్యక్రమంలో భాగంగా, సుమారు రూ.37,000 కోట్ల వ్యయంతో, సౌరశక్తితో పనిచేసే 97,500 మొబైల్ 4జీ టవర్లను ప్రధాని మోదీ ప్రారంభించారు. దేశంలోని ప్రతి గ్రామానికి 4జీ సేవలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన '100 శాతం 4జీ సాచురేషన్ ప్రాజెక్టు'కు కూడా ఆయన శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఒడిశాలోని 2,472 గ్రామాలతో సహా దేశవ్యాప్తంగా సరిహద్దు, మారుమూల, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లోని 26,700కు పైగా గ్రామాలకు తొలిసారిగా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో సుమారు 2.2 కోట్ల మంది పౌరులకు ప్రయోజనం చేకూరనుంది.

**భారత టెక్ దిగ్గజాల భాగస్వామ్యం**

ఈ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ రూపకల్పనలో బీఎస్ఎన్ఎల్‌తో పాటు దేశీయ టెక్ దిగ్గజాలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ-డాట్), తేజస్ నెట్‌వర్క్స్ లిమిటెడ్ కీలక పాత్ర పోషించాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా టీసీఎస్ డేటా సెంటర్ల ఏర్పాటు, నెట్‌వర్క్ నిర్వహణ వంటి బాధ్యతలను నిర్వర్తించగా, సీ-డాట్ కోర్ అప్లికేషన్‌ను, తేజస్ నెట్‌వర్క్స్ బేస్ స్టేషన్లు, రేడియో పరికరాలను అందించాయి. లక్షకు పైగా సైట్లలో ఈ స్వదేశీ పరికరాలను విజయవంతంగా నెలకొల్పారు. ఈ నెట్‌వర్క్ పూర్తిగా క్లౌడ్ ఆధారితమైనది కావడంతో, భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేసేందుకు వీలుంటుందని అధికారులు తెలిపారు.ఈ విజయంతో, సొంతంగా 4జీ, ఆపై టెక్నాలజీలను అభివృద్ధి చేసిన డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియా, చైనా వంటి అతికొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది. టెలికాం పరికరాల కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించి, జాతీయ భద్రతను బలోపేతం చేయడంలో ఇది కీలక ముందడుగు అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**గ్రామీణ భారత్‌కు డిజిటల్ వరం**

ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ జె. రవి మాట్లాడుతూ, "ఇది జాతి గర్వించదగ్గ చారిత్రాత్మక విజయం. టీసీఎస్, తేజస్ నెట్‌వర్క్స్, సీ-డాట్ భాగస్వామ్యంతో నిర్మించిన మా స్వదేశీ 4జీ నెట్‌వర్క్, ఆత్మనిర్భర్ భారత్ నినాదానికి నిలువుటద్దం" అని అన్నారు. టీసీఎస్ సలహాదారు, తేజస్ నెట్‌వర్క్స్ ఛైర్మన్ ఎన్. గణపతి సుబ్రమణియం మాట్లాడుతూ, "సొంతంగా టెలికాం టెక్నాలజీని అభివృద్ధి చేసిన అతికొద్ది దేశాల సరసన భారత్‌ను నిలబెట్టడం మాకు గర్వకారణం. బీఎస్ఎన్ఎల్‌లో ఈ నెట్‌వర్క్‌ను విజయవంతంగా వ్యవస్థీకృతం చేయడం దేశంలోని ప్రతి మూలకు శక్తివంతమైన డేటా, వాయిస్ నెట్‌వర్క్‌ను తీసుకెళ్లడంలో చరిత్రాత్మకమైనది" అని వివరించారు.గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్య, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు, 24 గంటల టెలిమెడిసిన్ వంటి సేవలు అందుబాటులోకి రావడానికి ఈ నెట్‌వర్క్ దోహదపడుతుంది. ప్రధాని మోదీ కలలు కన్న 'డిజిటల్ ఇండియా' లక్ష్య సాధనలో ఈ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ ఒక మైలురాయిగా నిలిచిపోతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# కాంగ్రెస్ బాకీ కార్డ్ ఉద్యమం

## ఆ పార్టీ మోసాలను వివరించేందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 ఆంధ్ర ప్రగతి**

కాంగ్రెస్ చేసిన మోసాలను రాష్ట్ర ప్రజలకు వివరించేందుకు 'కాంగ్రెస్ బాకీ కార్డ్' ఉద్యమం మొదలు పెట్టినట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఏ వర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత బాకీ ఉందో తెలిపేలా ఉద్యమం ఉంటుందని చెప్పారు. హామీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్ కు పంచాయతీ, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం మాజీ మంత్రులతో కలిసి హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో 'కాంగ్రెస్ బాకీ కార్డు' పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారం కోసం కాంగ్రెస్ అడ్డమైన హామీలిచ్చిందని విమర్శించారు. గద్దెనెక్కిన తర్వాత వాటిని గాలికొదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై బీఆర్ఎస్ పార్టీ సమరశంఖం పూరించిందని ప్రకటించారు. ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారెంటీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలోని ఏ వర్గానికి ఎంతెంత బాకీ పడిందో లెక్కలతో సహా ప్రజల ముందుంచేందుకు 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమాన్ని మొదలుపెట్టినట్టు తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీ కార్డుకు విరుగుడే ఈ 'బాకీ కార్డు' అని హెచ్చరించారు. తమను మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పే అవకాశం ప్రజలకు వచ్చిందని తెలిపారు. బాకీ కార్డును బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఇంటికి తీసుకెళ్తారని చెప్పారు.కాంగ్రెస్‌ను నమ్మితే ప్రజలు మోసపోతారని కేసీఆర్ ముందు చెప్పిందే నేడు నిజమైందని తెలిపారు. మొదటి క్యాబినెట్‌లోనే హామీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 30కి పైగా క్యాబినెట్ సమావేశాలు నిర్వహించినా ఆ ఊసే లేదని ఎద్దేవా చేశారు. బాకీ కార్డులో ప్రతి అక్షరం రేవంత్ సర్కార్ మోసానికి నిలువుటద్దమని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని అన్ని వర్గాలను నిలువునా ముంచిందని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఎకరాకు రూ.15 వేలు, రూ.2 లక్షల రుణమాఫీ, వరికి రూ.500 బోనస్, కౌలు రైతులు, రైతు కూలీలకు రూ.15 వేలు, రూ.12 వేలు ఇస్తామన్న హామీల మేరకు అవి బాకీలు కావా? అని ప్రశ్నించారు. 2 లక్షల ఉద్యోగాల హామీ, నెలకు రూ.4 వేలు నిరుద్యోగ భృతి హామీకి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఒక్కో మహిళకు నెలకు రూ.2,500 హామీ మేరకు రూ.55 వేల చొప్పున, పెళ్లైన ఆడబిడ్డలకు తులం బంగారం హామీ మేరకు 8 లక్షల మంది ఆడబిడ్డలకు 8 లక్షల తులాల బంగారం ఇవ్వకపోవడం నయవంచన కాదా? అని మండిపడ్డారు. వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4 వేల పెన్షన్ హామీ మేరకు ఒక్కొక్కరికి రూ.44 వేలు, వికలాంగులకు నెలకు రూ.6 వేలు హామీ మేరకు ఒక్కొక్కరికి రూ.44 వేలు బాకీ ఉన్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, విద్యార్థినులకు స్కూటీలు, యువతకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డులు, ఆటో డ్రైవర్లకు రూ.24 వేలు బాకీ ఉందని కేటీఆర్ తెలిపారు.

# భీమేశ్వర బుట్ట భోజనం హొటల్ ను ప్రారంభించిన అభిరుచి మధు.








**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 27:** నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ లో రమేష్ క్యాటరింగ్ నిర్వాహకులు ఆధ్వర్యంలో భీమేశ్వర్ బుట్ట భోజనం ,ప్యూర్ వెజిటేరియన్, టిఫిన్,కాఫీ,హొటల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా నంద్యాల బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు, పాల్గొని రిబ్బన్ కట్ చేసి హొటల్లో ప్రారంభించారు. అనంతరం జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ.. నంద్యాల ఒకటవ పట్టణ బిజెపి అధ్యక్షులు రమేష్ కుఅభినందనలు తెలుపుతూ దసరా పండుగ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని ప్రజలకు భోజన ప్రియులకు ఆనందాన్ని కలిగించేలా, పద్మావతి నగర్ లో భీమేశ్వర బుట్ట భోజనం ప్యూర్ వెజిటేరియన్ , హొటల్ నంద్యాల లో నూతనంగా ఏర్పాటు చేయడం శుభపరిణామం అని ప్రామాణికమైన ఆంధ్ర వంటకాలను అందించడంలో అత్యంత ప్రజాదరణ పొందిన రమేష్ క్యాటరింగ్ నిర్వాహకులు ఆధ్వర్యంలో భీమేశ్వర్ ప్యూర్ వెజిటేరియన్ హొటల్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందని అలాగే రమేష్ క్యాటరింగ్ నంద్యాల పట్టణంలో కొన్ని సంవత్సరాలుగా, ఈ బ్రాండ్ దాని ట్రేడ్‌మార్క్ దాటి బుట్టా భోజనం ఖ్యాతిని త్వరలో పొందుతుందని తెలిపారు అలాగే "బుట్టా భోజనం" సాంప్రదాయ అరటి ఆకుపై బియ్యంతో పాటు వడ్డించే అనేక వంటకాల్లో పప్పు, కూరలు, సాంబార్, చట్నీలు, మజ్జిగ పులుసు మరియు స్వీట్లు ఉన్నాయి. ఈ హొటల్లో నంద్యాల భోజన ప్రియులు ఎక్కువగా ఇష్టపడతారని ఇతర వంటకాల్లో నేతి బూరెలు, పాకం గరాలు, కంది పోడి, కర్వేపాకు పోడి, ఊరగాయలు మరియు తెలుగు కుటుంబం ఇష్టపడే స్నాక్స్ ఉంటాయని తెలిపారు. కావున నంద్యాల ప్రజలు పద్మావతి నగర్ లో ఉన్న భీమేశ్వర బుట్ట భోజనం ప్యూర్ వెజిటేరియన్, హొటల్లో సందర్శించాలని కోరారు. అనంతరం నిర్వాహకులు నంద్యాల బిజెపి ఒకటవ పట్టణ అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ.. ముందుగా నంద్యాల పట్టణ ప్రజలకు ముందస్తుగా దసరా శుభాకాంక్షలు కొన్ని సంవత్సరాల నుండి రమేష్ క్యాటరింగ్ ద్వారా పట్టణ ప్రజలకు శుభకార్యాలకు రుచికరమైన వంటకాలతో నంద్యాల ప్రజలకు అందిస్తూ ముందుకు సాగుతున్నామని ఈ ప్రేమ అభిమానానికి నంద్యాల భోజన ప్రియులే కారణమని ఈ రమేష్ క్యాటరింగ్ ద్వారా ఎన్నో శుభకార్యాలను నిర్వహించామని ఇప్పుడు ఇప్పుడు మన నంద్యాల పట్టణం పద్మావతి నగర్ లో భీమేశ్వర బుట్ట భోజనం ప్యూర్ వెజిటేరియన్, హొటల్లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నా బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించడం అనేది శుభ పరిణామం అని మధుగారు ఆశీస్సులు ఎల్లప్పుడూ మాపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు అలాగే నంద్యాల ప్రజలు ఈ భీమేశ్వర బుట్ట భోజనం ప్యూర్ వెజిటేరియన్ ,హొటల్లో సందర్శించాలని కోరారు, కార్యక్రమానికి నిర్వాహకులు రమేష్ ఆహ్వానం మేరకు ప్రముఖ ఆర్యవైశ్యులు భవనాసి నాగ మహేష్ పాల్గొని పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ శనివారం నాడు నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ లో భీమేశ్వర బుట్ట భోజనం ప్యూర్ వెజిటేరియన్, హొటల్లో ప్రారంభించడం చాలా సంతోషకరమైన విషయం అని ఈ బుట్ట భోజనం అనేది పల్లెటూర్లోనే కాదు నంద్యాల పట్టణంలో కూడా బుట్ట భోజనం రుచి ఏంటో అనేది భీమేశ్వర బుట్ట భోజనం హొటల్ ద్వారా ప్రజలకు నిరూపితం అవుతుందని అలాగే నంద్యాల పట్టణంలో ప్యూర్ వెజిటేరియన్, హొటల్ దొరకడం పట్టణంలో కష్టంగా మారిందని ఈ హొటల్ ను రమేష్ క్యాటరింగ్ నిర్వాహకులు నంద్యాల పట్టణంలో ఏర్పాటు చేసి ప్రారంభించినందుకునిర్వాహకులకు సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, బీజేపీ బాలు,పట్టణ ఒకటవ అధ్యక్షుడు రమేష్, ప్రముఖ ఆర్యవైశ్యులు భవనాసి నాగ మహేష్, గెలివి రామకృష్ణ,రమణ, బీజేపీ పార్టీ నాయకులుతదితరులు పాల్గొన్నారు.





## ఈవీఎం గోదాములను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 27:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీలలో భాగంగా, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శనివారం టేక్కే మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎంలను భద్రపరిచిన గోదాములను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. గోదాముల వద్ద వేసిన సీళ్లను కలెక్టర్ వారి సమక్షంలో పరిశీలించగా,ఈవీఎంల భద్రతా ప్రమాణాలు,రక్షణ చర్యలు సక్రమంగా ఉన్నాయో లేదో ఆమె సమీక్షించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేసి తనిఖీలను అధికారికంగా నమోదు చేశారు. ఈవీఎంల గోదాముల వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ గార్డులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం భద్రతా ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆమె ప్రత్యేకంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, తాసిల్దార్ సత్య శ్రీనివాసులు, ఎలక్షన్ డిటి మనోహర్, రాజకీయ పార్టీల తరపున కాంగ్రెస్ నుండి సయ్యద్ రియాజ్ బాషా, వైఎస్సార్సీపీ నుండి సాయిరాం రెడ్డి, టిడిపి నుండి శివరామిరెడ్డి, సిపిఎం నుండి నరసింహులు, బిజెపి నుండి కసెట్టి చంద్రశేఖర్ హాజరై పర్యవేక్షణలో పాల్గొన్నారు.

## అపార్ ఐడి ప్రక్రియను వేగవంతం చేయండి.

**జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 27:** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల అపార్ ఐడి (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత విద్యాధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్లో అపార్ ఐడి ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంలో భాగంగా విద్యార్థుల విద్యా పురోగతిని ట్రాక్ చేయడానికి అపార్ ఐడి కీలక సాధనమని, దీనివల్ల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని తెలిపారు. 138 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న16,102 మంది విద్యార్థులలో 11,301 మందికి అపార్ ఐడి పూర్తయిందని ఇంకా 4,801 మంది విద్యార్థుల ఐడీలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పదవ తరగతి సర్టిఫికెట్ లోని పేరు, డేట్ అఫ్ బర్త్ మరియు ఆధార్ లోని పేరు, డేటాఫ్ బర్త్, తల్లి తండ్రి పేర్లు సమానంగా ఉంటేనే అపార్ ఐడి జనరేట్ అవుతుందని కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం సమీప ఆధార్ కేంద్రానికి వెళ్లి రు.50/-ల రుసుము చెల్లించి అపార్ ఐడి జనరేట్ చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆధార్ అప్డేట్ గాని పిల్లలందరి చేత సంబదిత కళాశాలల ప్రిన్సిపాల్ లచే ఆధార్ జనరేట్ చేయించుకొని అపార్ ఐడి రిజిస్ట్రేషన్ చేయించేలా ఆదేశాలు జారీ చేయాలని డివిఈఓ, డీఈఓ లను కలెక్టర్ సూచించారు. అలాగే 1962 ప్రభుత్వ మరియు ప్రవేట్ పాఠశాలల్లో చదువుతున్న 3,30,135 మంది విద్యార్థులలో 2,72,193 మందికి అపార్ ఐడి పూర్తయిందని, మిగిలిన 57,942 మందికి అపార్ ఐడీలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాల్లో 40,798 మంది చిన్నారులలో 24,936 మందికి అపార్ ఐడి పూర్తి కాగా, ఇంకా 15,894 మందికి ఐడీలు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మొత్తం 87,679 అపార్ ఐడీ రిజిస్ట్రేషన్ లను వేగవంతంగా పూర్తి చేసేందుకు డిఈఓ, డివిఈఓ, ఐసిడిఎస్ పిడిలు పూర్తి స్థాయిలో దృష్టి సారించి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. బర్త్ సర్టిఫికెట్ లేని పక్షంలో సంబదిత ఆర్డీఓల దగ్గర లేట్ బర్త్ రిజిస్ట్రేషన్ అప్లై చేసుకొని బర్త్ సర్టిఫికెట్ పొంది ఆధార్ కార్డ్ జనరేట్ చేయించుకుని అపార్ ఐడి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఈఓ జనార్దన్ రెడ్డి, డివిఈఓ శంకర్ నాయక్, ఐసిడిఎస్ పిడీ లీలావతి, జీఎస్డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## మహిళల హక్కులకై, సమస్యల సాధనకై ఉద్యమాలకు సిద్ధం కండి.

**-ఐద్వా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే రమాదేవి.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 27:** దేశంలోనూ,రాష్ట్రంలోనూ మహిళలపై చిన్నారులపై పోతున్నాయని వీటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని అత్యాచారం హత్య జరుగుతున్న చేస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడం వలన, రోజురోజుకు మహిళలపై జరుగుతున్న దాడులు పెరిగి పోతున్నాయని వాటికీ అడ్డుకట్ట వేయడం లోప్రభుత్వాలు విఫలం అయ్యాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల రమాదేవి అన్నారు. స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ఐద్వా పట్టణస్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి యామ సుజాత అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో 5వ జిల్లా అధ్యక్షురాలు టి నిర్మల సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, కె మహమ్మద్ గౌస్, మహిళా సంఘం నాయకురాలు హైమావతి, లలితమ్మ,ప్రసన్న, నాగరాణి వీరితోపాటు 400 మంది కి పైగా మహిళలు పాల్గొనడం జరిగింది.అనంతరం మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే. రమాదేవి, నంద్యాల జిల్లా అధ్యక్షురాలు టి నిర్మల లు మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందుకు మహిళలకు అన్ని రంగాలలో సమ ప్రాధాన్యం కల్పిస్తామన్న మాట అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వాలు తప్పుతున్నాయని, ముఖ్యంగా ప్రభుత్వం కేవలం మహిళలను ఓటు బ్యాంకుగా వినియోగిస్తున్నాయని, అధికారం వచ్చిన తర్వాత మహిళలకు ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని, దేశంలో ప్రతి గంటకు ఎక్కడో ఒకచోట మహిళలపై దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేయడం వలన రోజురోజుకీ మరింత పెరిగిపోతున్నాయని, చిన్న పిల్లలపై దారుణాలు మరీ ఎక్కువైపోయాయని దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికైనటువంటి ప్రజాప్రతినిధులే మహిళల కట్టు-బొట్టు పై విమర్శలు చేయడం మరి నీచంగా దిగజారి మాట్లాడడం వలన దాడులు చేస్తున్న వారు మరి ఎక్కువైపోయారని, ఏం చేసినా శిక్ష పడకుండా ఉండేందుకు అధికార పార్టీలలో చేరుతున్నారని వారే మళ్లీ నాయకులుగా చలామణి అవుతున్నారని, దేశంలో ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా ఉన్న వారిపై అత్యాచారం, మహిళలపై దాడుల కేసు లు ఉన్నాయని వారందరిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు అని ఉన్నారు. రాజ్యాంగంలోని ఆవులకు మహిళలకు కాపాడటంలో అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, మనుధర్మ శాస్త్రాన్ని తెరపైకి తీసుకువచ్చి మహిళలను వంటింటికి పరిమితం చేసే విధంగా పాలన సాగిస్తుందని మహిళలను బానిసలుగా చూడాలి తప్ప వాళ్ళను మనుషులుగా చూడకూడదు అనే విధంగా ఆర్ఎస్ఎస్ బిజెపిలు కుట్ర పన్నుతున్నాయని రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో ముందుకు పోతుందని ఎన్నికల సందర్భంలో టిడిపి మేనిఫెస్టో ప్రకారం ప్రతి మహిళకు 1500 రూపాయలు ఇస్తామన్న హామీని నెరవేర్చడం లేదని ప్రతి ఇంటికి మూడు సిలిండర్లు ఫ్రీగా ఇస్తామన్న హామీ నెరవేరలేదని తల్లికి వందనం లో నేటివరకు చాలామంది తల్లులకు నిధులు జమ కాలేదని ఉచిత బస్సు ప్రయాణం అంటూ ప్రగల్భాలు పలికి కేవలం కొన్ని బస్సులను మాత్రమే మహిళలకు కేటాయించి మోసం చేశారని అదేవిధంగా ప్రతి మహిళను లక్షాధికారిని చేస్తానన్న హామీ ఏమైందని ఇల్లు లేని నిరుపేదలందరికీ పట్టణంలో రెండు సెంట్లు గ్రామాలలో ఇస్తామన్నా హామీ వెంటనే నెరవేర్చాలని అదేవిధంగా టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి మహిళలపై ముఖ్యంగా స్కీములలో పనిచేసే మహిళ కార్మికులపై ఏ విధంగా తొలగించాలి వాళ్ల కుటుంబాన్ని ఏ విధంగా ఇబ్బందులకు గురి చేయాలి అనే విధంగా చోటామోటా నాయకులంతా ప్రయత్నం చేస్తున్న వారికి అనుకూలంగా నిర్ణయాలు ప్రజాప్రతినిధులు చేయడం సరైనది కాదని వాటిపైన రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు మహిళలకు ఏ సమస్య వచ్చినా ఐద్వా ముందుండి పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉందని అన్నారు.

## డీఐజీ ని మర్యాదపూర్వకంగా కలిసిన అభిరుచి మధు.

**...రాజకీయ పరిస్థితులు వివరించిన అభిరుచి మధు.**

**...శ్రీశైలం కు వరాల జల్లులు కురిపించనున్న ప్రధాని నరేంద్ర మోదీ.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 27:** కర్నూలు డి ఐ జి కోయ ప్రవీణ్ ను నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు కలిశారు.ప్రధాని నరేంద్ర మోదీ వచ్చేనెల కర్నూలు,నంద్యాల జిల్లా లో పర్యటిస్తున్న సందర్భంగా డి ఐ జి నీ కలిసి రాజకీయ పరిస్థితులు వివరించారు.ఈ సందర్భంగా అక్కడ నుంచి వచ్చిన ఆయన మీడియా తో మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ అక్టోబర్ 16 న కర్నూలు ,నంద్యాల జిల్లాలో పర్యటిస్తున్నారని అన్నారు.కర్నూలు లో ప్రదానితో కలిసి కూటమి నేతలు రోడ్ షో నిర్వహిస్తారని అన్నారు.అనంతరం శ్రీశైలం మల్లన్న ను దర్శించుకొని పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారన్నారు.ప్రధాని మదిలో శ్రీశైలం కు వరాల జల్లులు కురిపిస్తున్నారు.ప్రధానంగా రోప్ వే,సున్నిపెంటకు రైలు మార్గం,నంద్యాల జిల్లాలో నవనారసింహులు,నవనందులు భక్తులు దర్శించుకోవడానికి టూరిజం వాహనాలు,ఫారెస్ట్ లో వాహనదారులు ఇబ్బందులు లేకుండా నాలుగులైన్ల రహదారి,సున్నిపెంటలో మినీ విమానాలు ల్యాండ్ అయ్యేందుకు ,మినీ ఎయిర్ పోర్ట్,తిరుమల తర్వాత శ్రీశైలం ను అభివృద్ధి చేయడం,శ్రీశైలం భ్రమరాంబిక గతంలో ఛత్రపతి శివాజీకి ఖడ్గం బహిరించినట్టు పురాణాలు చెపుతున్నాయి అన్నారు.25 ఎకరాల్లో శివాజీ హబ్ ఏర్పాటు చేసి,భారీ శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలు శ్రీకారం చుట్టే ఆలోచన ఉందన్నారు.శ్రీశైలం అభివృద్ధికి వేల కోట్లు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. బిజెపి అంటేనే అభివృద్ధి...అభివృద్ధి అంటేనే మోదీ అని అన్నారు.నంద్యాల జిల్లా లోని శ్రీశైలం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 28 సెప్టెంబర్ 2025

# నంద్యాలలో కొత్త కియా షోరూం ప్రారంభం.!

-ఇక కియా కార్లు, సర్వీసులు ప్రజల ఇంటి ముందే. --స్థానిక యువతకు ఉపాధి, వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 27:** నంద్యాలలో ఇప్పుడు కియా కార్లు మరింత చేరువయ్యాయి. ఆళ్లగడ్డ రోడ్డులోని దీబగుంట్లలో కొత్తగా కియా కార్ల షోరూం ప్రారంభమైంది. ఈ శోరూం ను కియా మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదిత్య ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆదిత్య.. ఇకపై నంద్యాల జిల్లా వినియోగదారులకు ఆధునిక కార్లు, నమ్మకమైన సర్వీసులు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తొలి కారును ఈ సందర్భంగా టాటా లైఫ్ ఉద్యోగి దూదేకుల బాలరాజు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా తనకే తొలి కారు స్వంతం కావడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ.. కొత్త షోరూం ప్రారంభం కావడంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, వినియోగదారులు ఇకపై ఇతర పట్టణాలకు వెళ్లకుండా ఇక్కడే సర్వీసులు, స్పేర్ పార్ట్స్ సౌకర్యం పొందగలరని తెలిపారు. అంతేకాకుండా వచ్చే ఒక నెల రోజుల పాటు ప్రత్యేక ఆఫర్లు, డిస్కౌంట్లు, ఎక్స్ఛేంజ్ స్కీములు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని, ఫైనాన్స్ సదుపాయాలు కూడా కల్పిస్తున్నామని శోరూం యాజమాన్యం ప్రకటించింది.

# వంటింట్లో నూనెల మంట

## పెరిగిన వంటనూనెల ధరలు -అంతగా కనిపించని జీఎస్టీ ప్రభావం



న్యూఢిల్లీ , **సెప్టెంబర్ 27 ఆంధ్ర ప్రగతి** పండుగ సీజన్‌లో వంటనూనెలు మంటపెడుతున్నాయి. వంట చేసుకోవాలంటేనే ఆలోచించాల్సి వస్తోంది. జీఎస్టీ తగ్గి ధరలు దిగివస్తాయనుకుంటున్న వేళ వంటనూనెలు మంటపుట్టిస్తున్నాయి. దసరా, దీపావళి వంటి కీలక పండుగల సమయంలో వంట నూనెల ధరలుభారీగా పెరగడం ఆందోళనకు గురి చేసింది. లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ ఏకంగా 172 రూపాయలకు చేరింది. జీఎసటీ రేట్లు తగ్గించిన సమయంలో దిగిరావాల్సిన నూనెలు మండుతున్నాయి. ఈ మధ్య కాలంలో 142 వరకు ఉన్న సన్‌ఫ్లవర్ ధర ఏకంగా 30 రూపాయలు పెరిగింది. ఇలా ఒక్కటేమిటి..అన్ని నిత్యావసర ధరలు భారీగా పెరిగాయి. వీటికి తోడు నిత్యం వాడే నూనె ధరలు పెరగడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం, ఈ నెల రోజుల్లో ఆవనూనె ధరలు 9.10 శాతం, పామాయిల్ ధరలు 14.16 శాతం పెరిగాయి. నెల రోజుల్లో, ఆవనూనె ధర ఇటు రిటైల్ మార్కెట్‌లో అటు ఆన్‌లైన్ కిరాణా కంపెనీల పోర్టల్స్‌లో 26 శాతం పెరిగింది. నెల రోజుల క్రితం ఆన్‌లైన్ కిరాణా పోర్టల్‌లో లీటరు ఆవనూనె రూ.139 కి లభించగా, ఇప్పుడు దీని ధర లీటరుకు రూ.230 కి చేరుకుంది. అంటే గత నెలలో ధరలు 26.61 శాతం పెరిగాయి. మస్టర్డ్ ఆయిల్‌ను ఉత్తర భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో వంటనూనెగా ఉపయోగిస్తారు. ప్రభుత్వ లెక్కలు కూడా ఎడిబుల్ ఆయిల్ ధరల పెరుగుదల నిజమేనని చెబుతున్నాయి. దిగుమతి సుంకాన్ని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీనివల్లే వంటనూనెల దిగుమతులు ఖరీదయ్యాయి. క్రూడ్ సోయాబీన్ ఆయిల్, క్రూడ్ పామాయిల్, క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై దిగుమతి సుంకాన్నిపెంచింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల పామాయిల్ నుంచి సోయా వరకు అన్ని రకాల వంటనూనెల ఖరీదయ్యాయి. దేశీయ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు దిగుమతి సుంకాన్ని పెంచినట్లు కేంద్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ, రేట్ల పెంపు ప్రభావం నేరుగా సామాన్య జనంపై పడింది. నూనెలను ఎక్కువగా వినియోగించే పండుగ సీజన్‌లో, సరైన టైమ్ చూసి సర్కారు దెబ్బకొట్టింది.

# గిరిజనులకు భోజన వసతి కల్పించిన ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని.





**ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 27:** గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గిరిజనుల కష్టాలు అన్ని ఇన్ని కావు గూడెంలో ఉండలేని పరిస్థితి. మహానందిలోని చెంచుగూడెంలో సుమారుగా 42 కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గిరిజనుల గూడెంలోకి వర్షపు నీరు చేరి అటు ఇంట్లో, ఇటు బయట ఉండలేని పరిస్థితి దయనీయంగా మారింది. ఇటు వర్షం తగ్గింది కదా అని గూడెం లోని నీరు తోడిపోసేలోపే మరలా వర్షం కురుస్తుండడంతో వారు చాలా నానా ఇబ్బందులు పడుతున్నట్టు తెలుపుతున్నారు. ఈ సమస్యను మండల అధ్యక్షురాలు అయిన ఎంపీపీ బుడ్డారెడ్డి యశశ్విని దృష్టికి సిపిఐ సామేలు తీసుకువెళ్లగా తక్షణమే స్పందించి వారు గూడెంలోని గిరిజనులందరికి భోజనం సౌకర్యం ఏర్పాటు చేస్తానని చెప్పినట్టు తెలిపారు. చెప్పినట్టుగానే ఎంపీపీ గూడెంలోని గిరిజనులను కలుసుకొని వారి యొక్క ఇబ్బందులను అడిగి తెలుసుకొని స్వయంగా వారే దగ్గర ఉండి మరి భోజనం వడ్డించి వారితో పాటు కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం టిడిపి నాయకులు ఉల్లి మధు, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెంచు కాలనీని సందర్శించిన ఎమ్మార్వో రమాదేవి.

**ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 27:** మహానంది మండలం ఆర్ఎస్ గాజులపల్లి లోని గిరిజన కాలనీని శనివారం తాసిల్దార్ సందర్శించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గిరిజనులు పడుతున్న ఇబ్బందులను చూడలేక వారి కాలనీలోకి వెళ్లి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. వీరితోపాటు కార్యక్రమంలో తధి తర అధికారులు, స్థానిక టిడిపి నాయకులు పాశం శ్రీనివాసులు పాల్గొన్నారు.



# వి వో ఏ లపై పని భారం తగ్గించి, పెండింగ్ వేతనాలు ఇవ్వాలి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 27:** వివో ఏ లపై పని భారం తగ్గించి పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు జిల్లా కార్యదర్శి ఏ తిరుపతయ్య సిఐజియూ జిల్లా కార్యదర్శి బాల వెంకట్ లు డిమాండ్ చేశారు.శనివారం నంద్యాల పట్టణంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో వివో ఏల సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి కే భాస్కర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న పై నాయకులు మాట్లాడుతూ వివో ఏల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వం రోజుకొక యాప్ విడుదల చేస్తూ వివో ఏలపై పని భారం పెంచిందని వెంటనే పని భారం తగ్గించాలని గతంలో ఇచ్చిన సెల్ ఫోన్ సిమ్ములు ఏ మాత్రం పనిచేయడం లేదని అన్నారు. సొంత సెల్ ఫోన్ తోనే ఆన్లైన్ వర్క్ చేస్తున్నారని ప్రభుత్వము వెంటనే 5జి సిమ్ములు ఇచ్చి సెల్ ఫోన్లు ఇవ్వాలని అలాగే వివో ఏ లకు అన్యాయం కలిగించే కాలపరిమితి సర్కిల్ వెంటనే రద్దు చేయాలని వారికి కనీస వేతనం ఇవ్వాలని 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, వారికి ఉద్యోగ భద్రత పాటు రాజకీయ వేధింపులు అరికట్టాలని హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని వారికి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అనంతరం వివోఏల సంఘం నూతన జిల్లా కమిటీని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు ఏకీభవంగా ఎన్నుకోవడం జరిగింది జిల్లా అధ్యక్షులుగా కేసు సోమన్న జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏ, తిరుపతయ్య ట్రెజరర్ గా కే. భాస్కర్, శ్రీనుఉపాధ్యక్షులుగా కృష్ణారెడ్డి, ఉగ్ర నరసింహ సహాయ కార్యదర్శులుగా శంకరయ్య, శిరోమణి తోపాటు మరో 20 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఏకీభవంగా ఎందుకు అవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నుండి వందమంది వివోఏలు పాల్గొన్నారు.

# పెద్దకొట్టాల లోతట్టు ప్రాంతాల్లో అధికారుల పర్యటన.

... బిసి కాలనీలో ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ సెప్టెంబర్ 27:**నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ తహశీల్దార్ శ్రీ వాణి పేర్కొన్నారు.పెద్దకొట్టాల బిసి కాలనీలో వరదనీరు చేరుకున్న విషయం తెలుసుకొని ఆర్ ఐ మాధవి రెడ్డి,డిప్యూటీ తహశీల్దార్ రామచంద్ర రావు,తహశీల్దార్ శ్రీ వాణి పర్యటించారు.గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు దిగువ ప్రాంతాలకు చేసుకుంటుంది.ఈ నేపథ్యంలో పెద్దకొట్టాల బిసి కాలనీలో వరద నీరు చేరడంతో ఆ ప్రాంతానికి వెళ్లి అధికారులు పరిశీలించారు.వర్షాన్ని దృష్టిలో పెట్టుకొని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.ఆ ప్రాంతంలోని వాగులు,వంకల్లో వరద నీరు ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రజల కు జాగ్రత్తలు చెపుతున్నారు.మరో రెండు రోజులు వర్షాలు ఉన్నాయని ,ఏ నిమిషంలో అయినా ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు,సిద్ధంగా ఉన్నారని తహశీల్దార్ శ్రీ వాణి పేర్కొన్నారు.

# బాధితులకు అండగాఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని.

లోతట్టు ప్రాంతాలను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన.

ఇండ్లు ధ్వంసం అయిన బాధితులకు రూ.5000 ఆర్థిక సహాయం అందజేత.





**ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 27:** మహానంది మండలం తిమ్మాపురం , అబ్బీపురం గ్రామాల్లో భారీ వర్షానికి నీట మునిగిన లోతట్టు ప్రాంతాలను ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తిమ్మాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో భారీ వృక్షం నేలవాలి ఇళ్లు ధ్వంసం అయిన నిరుపేద బాధితులకు సొంతంగా రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు.మరియు మహానంది మండలం అబ్బీపురం చెంచుగూడెం లో పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి వారికి వడ్డించి, కాలనీ వాసులతో కలిసి భోజనం చేశారు. విద్యుత్ సమస్యలపై కాలనీవాసులు తెలుపగా వెంటనే విద్యుత్ ఏఈ ప్రభాకర్ రెడ్డికి ఫోన్ చేసి సమస్యను వివరించి, పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్ దౌల,ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ పవన కుమార్, ఏపీవో మల్లికార్జున,అబ్బీపురం సర్పంచ్ శవ్య శ్రీలక్ష్మి,పంచాయతీ సెక్రెటరీ నాగజ్యోతి, వీఆర్వో మోహన్, గ్రామ సచివాలయ సిబ్బంది,టిడిపి నాయకులు కందుల భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ దస్తగిరి,ఉల్లి మధు,తెలుగుగంగ 9 వ బ్లాక్ చైర్మన్ హరి ప్రసాద్ రెడ్డి , సిపిఐ జిల్లా కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, మండల కార్యదర్శి సామేలు,తదితరులు పాల్గొన్నారు. మరియు తిమ్మాపురం గ్రామంలో రింగు రోడ్డు వెంట ఉన్న వంక కాలువ వెంట సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మి పూడికతీత పనులు చేపట్టి వర్షపు నీరు వెళ్లాలా చేశారు.

# పొంగిపొర్లుతున్న వాగులు వంకలు.




**ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 27:** శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షాల వల్ల మహానంది మండలంలో పలు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. మహానంది బోయలకుంట్ల మెట్ట రహదారిలో నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన వర్షాల వల్ల పాలేరు వాగు ప్రవహిస్తూ ఉండడంతో రాకపోకులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నంద్యాల మహానంది రోడ్డులోని బుక్కాపురం వద్ద ఉన్న చెరువు యొక్క అలుగులు పరిమితికి మించి ప్రవహిస్తూ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తూ ఉండడంతో మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి పోలీసులను అప్రమత్తం చేసి వాహనదారులు ఇబ్బందులు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.పంట పొలాలకు వెళ్లిన స్థానికులు, వాహనదారులు వాగులు వంకలు దాటేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు సమాచారం.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## అర కొరగా తూతు మంత్రంగా

# విద్యుత్ అలంకరణ.





**ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 27:**
అరా కొరగా.. తూతూ మంత్రంగా ఆలయానికి విద్యుత్ అలంకరణ మండలంలోని బొల్లవరం గ్రామంలో వెలిసిన శివాలయానికి చేయడం పలు విమర్శలకు తా విస్తుంది. మహానంది దేవస్థానం నకు 100 ఎకరాలు వ్యవసాయ భూములు ఉండగా బొల్లవరం గ్రామంలో ఉన్న ఆలయాలకు దాదాపు 80 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. లక్షలాది రూపాయలు ఆలయ భూముల ద్వారా ఆదాయం వస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన విద్యుత్ అలంకరణ నామమాత్రంగా ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ అలంకరణలో భాగంగా కనీసం స్వామి, అమ్మవార్ల ప్రతిమలు కూడా ఏర్పాటు చేయలేని స్థితిలో ఆలయ అధికారులు ఉన్నారంటే పర్యవేక్షణ లోపమా లేక నిర్లక్ష్యమా అనేది తెలియాల్సి ఉంది. కనీసం ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలు కూడా వెలగడం లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉంది అనేది అధికారుల విజ్ఞతకే వదిలి వేయాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తుంది. శరన్నవరాత్రి ఉత్సవాల్లోనే విద్యుత్ దీపాలు వెలగడం లేదంటే సాధారణ రోజుల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయి అనేది తేట తెల్లమవుతుంది.



## శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీ వాసవి మాత.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ సెప్టెంబర్ 27:**
మండల కేంద్రంలోని స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయం నందు శనివారం దస రా పండుగ సందర్భంగా శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో శ్రీ వాసవి మాత భక్తులకు దర్శనమిచ్చారు. దసరా పండుగ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వంకాదార సునీల్ ఆధ్వర్యం లో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. లలిత త్రిపుర సుందరిదేవికి ఉదయం నాగెళ్ల సద్గురు మూర్తి, మరియు గెలివి కార్తిక్ (నాగెళ్ల సురేష్ అల్లుడు)మరియు రాత్రి మేడా రామకృష్ణ దంపతుల చేత పూజా కార్యక్రమాలను ఆలయ పూజారి చెన్నకేశవ శర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య మండల సంఘం సభ్యులు, ఆర్యవైశ్య సోదర, సోదరీ మణులు పూజా కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.పూజాన%శీ%తరం గోవిందపల్లె విశ్వహిందూ పరిషత్ తరపున రామయ్య బృందము హిందువుల ఐక్యత గురించి బోదించారు. అనంతరం భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు.

## పనిని వాయిదా వేయరాదు !




తిరుమల,, **సెప్టెంబర్ 27 ఆంధ్ర ప్రగతి** పనిని వాయిదా వేయడం సరికాదు. ఆజ్ కా కామ్ ఆజ్ కరో..కల్ కాక కామ్ ఆజ్ కరో అని పెద్దలు చెప్పారు. ఎప్పటి పని అప్పుడే చేయాలి. పని చేయడానికి కార్యాచరణ కూడ ఆముఖ్యమే. రేపటి పనిని నేడు, నేటి పనిని ఇప్పుడే చేయాలని కార్యదీక్ష కలవాళ్లు అనుకుంటారు. అలా చెయ్యడానికి పూనుకొంటారు. అప్పుడే పనులవేగం పెరుగుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేయడానికి వీలవుతుంది. మన జీవితకాలంలో ఏమి సాధించామన్నదే జీవన సాఫల్య గణనలోకి వస్తుంది. అంతేతప్ప, ఎన్నాళ్లు జీవించామనేది లెక్కలోకి రాదు.సమయం విలువ తెలిసినవారు క్షణమైనా వ్యర్థం చెయ్యరు. ప్రతి క్షణాన్నీ ఎలా సద్వినియోగం చెయ్యాలో ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. తాము ఎంచుకున్న రంగంలో మానసికంగా, భౌతికంగా నిమగ్నులై ఉంటారు. ఒక రచయిత, కవి, చిత్రకారుడు భౌతికంగా చేసే కృషి కన్నా ఎన్నో రెట్లు మానసికంగా చేసే భావనాత్మక కృషి ఉంటుంది. నిద్రలో మనసులో మథనం జరుగుతూనే ఉంటుంది. వాటిని చెదిరిపోకుండా పదిలపరచు కోగలిగితే అద్భుత సృజనలుగా ఆవిష్కృతమవుతాయి. బ్రహ్మ సృష్టికర్త అయితే కళాకారుడు, కవి సృజనకారులు. అయితే, దేనికైనా ప్రాతిపదిక పవిత్రంగా ఉండాలి. భావ ప్రసారంలో స్పష్టత ఉండాలి. అప్పుడే అది ఆశించిన ప్రయోజనాన్ని పొందుతుంది.

## అసెంబ్లీకి రాకుండా జీతాలెలా తీసుకుంటారు

### వైసిపి ఎమ్మెల్యేలపై మండిపడ్డ విప్ మాధవిరెడ్డి



అమరావతి, **సెప్టెంబర్ 27 ఆంధ్ర ప్రగతి**
వైసీపీ ఎమ్మెల్యేలపై (ప్రభుత్వ విప్ రెడ్డప్పగారి మాధవి రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలోని సమస్యలపై చర్చించేందుకు సభకు రాని వైసీపీ సభ్యుల... జీతాల కోసం మాత్రం దొంగచాటుగా వస్తున్నారంటూ మండిపడ్డారు. ప్రజల పట్ల, వారి సమస్యల పట్ల వైసీపీ ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు మొదలైనప్పటి నుంచి సభకు రాని.. ఆ పార్టీ సభ్యులు జీతాలు తీసుకోడానికి మాత్రం దొంగచాటుగా వస్తారా అంటూ రెడ్డప్పగారి మాధవి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. వైసీపీ ఎమ్మెల్యేలకు దొంగచాటు– సంతకాలపైనే శ్రద్ధ ఉందంటూ ఎద్దేవా చేశారు. తమ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం సభకు రావాలనే చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. జీతాల కోసం మాత్రం దొంగచాటుగా సంతకాలు పెట్టిపోతున్నారని ఫైర్ అయ్యారు. వైసీపీ ఎమ్యెల్యేలు సభలో ఇక దొంగచాటు–గా సంతకాలు పెట్టి తప్పించుకోలేరన్నారన్నారు. ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ ద్వారా ఎంతసేపు సభలో ఉన్నారో తెలిసిపోతుందని చెప్పారు. సభకు రాకుండా దొంగ సంతకాలు చేసినవారి జాబితా తమ వద్ద ఉందని ప్రభుత్వ విప్ రెడ్డప్పగారి మాధవిరెడ్డి పేర్కొన్నారు.

## ఎపి శాసనమండలి నిరవధిక వాయిదా

### పలు బిల్లులకు ఆమోదం తెలిపిన సభ

అమరావతి, , **సెప్టెంబర్ 27 ఆంధ్ర ప్రగతి** ఏపీ శాసనమండలి నిరవధికంగా వాయిదా పడింది. అంతకుముందు ఆరు బిల్లులకు ఆమోదం తెలిపింది. అంతర్జాతీయ వర్సిటీ– ఏర్పాటు బిల్లు–2025ను మండలి ఆమోదించింది. న్యాయవిద్య, పరిశోధన కోసం అమరావతిలో భారత అంతర్జాతీయ వర్సిటీ– ఏర్పాటు– చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ ప్రైవేటు– వర్సిటీల (స్థాపన, క్రమబద్ధీకర) చట్టం–2025, ఏపీ వర్సిటీ–ల సవరణ బిల్లు–2025ను శాసనమండలి ఆమోదించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కుష్టువ్యాధి అనే పదం తొలగించేందుకు చేసిన చట్టసవరణకు మండలి ఆమోదం తెలిపింది. ఏపీ వ్యవసాయభూమి చట్టం 2006 బిల్లు, ఏపీ పబ్లిక్ సర్వీసులకు నియామకాల నియంత్రణ, వేతన సరళీకరణ బిల్లు–2025, –టె–న్నిస్ క్రీడాకారుడు సాకేత్ సాయిని డిప్యూటీ– కలెక్టర్‌గా నియమించే ప్రతిపాదన కోసం చేసిన చట్టసవరణను సభ ఆమోదించింది. ఏపీ వస్తుసేవల పన్ను బిల్లు–2025కు శాసనమండలి ఆమోదం లభించింది. అనంతరం ఛైర్మన్ మోషేన్ రాజు శాసనమండలిని నివధిక వాయిదా వేశారు.

## విజయ డైరీ లో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలి.

### ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా సెప్టెంబర్ 27:** ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శనివారం నాడు ఏపీ అసెంబ్లీలో నంద్యాల విజయ డైరీలో జరుగుతున్న అవినీతిపై చర్చించడం జరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో విజయ డైరీ అంటే తెలియని వారు ఎవరూ లేరని స్వచ్ఛమైన పాలు నెయ్యి అందించడంలో విజయ డైరీ కి మంచి గుడ్ విల్ ఉందని గతంలో భూమా నారాయణరెడ్డి చైర్మన్ గా ఉన్నప్పుడు చాలా వైసిపి ప్రభుత్వం వచ్చాక, విజయ డైరీలో చాలా కల్తీ జరుగుతుంది అని, హైదరాబాద్ విఎన్ఆర్ డైరీ నుంచి బాదం పాలు కొని విజయ డైరీ స్టిక్కర్స్ కరిపించి నాసిరకం బాదంపాలు అమ్ముతున్నారని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. పాలపొడి మిషన్ ఉన్నా కూడా బయట నుంచి కావాలని తెప్పిస్తున్నారని సంవత్సరానికి ?4,000 వేల టన్నులు అవసరం ఉంది,10 కె జి లు 200 అయితే బయట నుండి 400 వందలతో కొంటున్నారు దీని వలన సంవత్సరానికి 20 కోట్లు అదనంగా ఖర్చు అవుతుంది



అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు.
కర్ణాటక నుంచి డీజిల్ తెప్పించి ఆంధ్ర బిల్లులు పెట్టుకొని 5 నుండి 6 కోట్ల వైసీపీ చైర్మన్ జోబులో వేసుకుంటున్నడు అని, అతని మాట వినకుంటే బోర్డు మెంబర్స్ ను ప్రశ్నించిన ఉద్యోగులను ట్రాన్స్ఫర్లు చేయడం ఇలా బెదిరించుకొని విజయ డైరీ ని గుప్పెట్లో పెట్టుకున్నాడని దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలియజేసారు.మిల్క్ పాల ప్యాకెట్ పై ప్రజలపై భారం మోపి సంవత్సరానికి 7 కోట్లు పాల ప్యాకెట్లపై సంపాదిస్తున్నారని, గత కొద్దిరోజుల కిందట విజయ డైరీ ని స్థాపించిన ఎన్టీ రామారావు గారి శిలాఫలకాన్ని కాల్వలో పడేయడంతో మేము అక్కడికి వెళ్లి అధికారులతో కొట్లాడి మళ్లీ శిలాఫలకాన్ని అక్కడ పెట్టించడం జరిగిందని అన్నారు. విజయ డైరీ కి సంబంధించి 35 ఎకరాల భూమి ఉందని ఆ భూమిని వైసిపి చైర్మన్ గత వైసిపి హయాంలో వారిపై ఆన్లైన్ చేపించుకోవడం జరిగిందని దాదాపు 350 కోట్ల రూపాయలు విలువచేసే ఇప్పుడు ఈ భూమిని ప్రభుత్వానికి చేరేలాగా చర్యలు తీసుకోవాలని, గతంలో ఈ విషయంపై సీఎం దృష్టికి కూడా తీసుకొని వెళ్లడం జరిగిందని ఇద్దరు ఆఫీసులను అపాయింట్ చేయడం జరిగిందని వారు కూడా సరిగా పనిచేయడం లేదని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.
విజయ డైరీ ఎండి, చైర్మన్ చైర్మన్, ఆడిటర్ పై క్రిమినల్ కేసులు పెట్టాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అసెంబ్లీలో తెలియజేశారు.

## సమస్యల పరిస్కారం కోరుతూ గాంధీ,అంబేద్కర్ విగ్రహాలకు వినతి.

### గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ.

**ఆంధ్రప్రగతి నంద్యాల సెప్టెంబర్ 27:**
రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో మహాత్మా గాంధీ,అంబేద్కర్ విగ్రహాలలకు వినతిపత్రం ఇచ్చారు.అనంతరం జేఏసీ నాయకులు గురుస్వామి,ఈశ్వరయ్య మధుసూదన్ రెడ్డి,సంపత్ కుమార్,యజ్ఞేష్,పద్మావతి,ప్రసన్న రెడ్డి మాట్లాడుతూ గత వారం రోజుల నుండి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిస్కారం కోరుతూ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ సమస్యల పరిస్కారంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదని,అందువల్ల నల్ల బ్యాడ్జీలు ధరించి జాతీయ నాయకులైన మహాత్మా గాంధీ మరియు డా.బాబాసాహెబ్ అంబేద్కర్ గార్ల విగ్రహాలకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కావున ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ ప్రధాన సమస్యలలో ముఖ్యంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను వెంటనే వారి మాతృశాఖలకు అప్పజెప్పి,విభాగాల వారీగా అన్ని జిల్లాలో సీనియారిటీ జాబితాలను విడుదల చేసి అర్హులైన వారికి ప్రమోషన్ ఇవ్వాలని, స్టేషన్ సీనియారిటీ ఆధారంగా పారదర్శక బదిలీలు జరిగే విధంగా ప్రత్యేక విధి విధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేయాలని, గత ప్రభుత్వంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఆలస్యంగా జరగడం వల్ల రావాల్సిన,అరియర్స్ మరియు నోష్నల్ ఇంక్రిమెంట్లు తక్షణమే మంజూరు చేయాలి. అదేవిధంగా ఆరు సంవత్సరాల పాటు ఒకే క్యాడర్లో సర్వీస్ చేసిన ఉద్యోగులకు ఏ.ఏ.ఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని,గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రస్తుతం అమలు అవుతున్న రికార్డు అసిస్టెంట్ క్యాడర్ ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కు మార్పు చేయాలనే ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నామని, తమ సమస్యలను పరిస్కారం లభించేంత వరకు భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని రాష్ట్ర జేఏసీ పిలుపునిచ్చిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు శివశంకర్,రమణారావు, నరేంద్ర,రాంబాబు,జైనులబుద్దిన్,రహెల్ బాషా,రమేష్ రెడ్డి,ఉమాదేవి,సునీత,నజీని సుల్తానా,సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.




## అబ్బి పురం గ్రామ చెంచు గూడాన్ని ఆదుకోవాలి

**ఆంధ్ర ప్రగతి తిమ్మాపురం సెప్టెంబర్ 27:**
మహానంది మండలం అబ్బిపురం గ్రామ చెంచుగుడాన్ని అధికారులు అధికార పార్టీ నాయకులు గిరిజనగుడాన్ని సందర్శించి పరిశీలించి వారి ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సిపిఐ మండల కార్యదర్శి ఆర్ సామేలు సిపిఐ మండల సహాయ కార్యదర్శులు శ్రీనివాసులు తుపాకుల వెంకటేశ్వర్లు గ్రామ శాఖ కార్యదర్శి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. అబ్బిపురం చెంచుగూడెం లో గత రెండు రోజులుగా భారీగా కురిసిన వర్షాల వల్ల వర్షపు నీరు గృహాలలో చేరడం వల్ల కనీసం వంట చేసుకోవడానికి కూడా అవకాశం లేకపోవడంతో పస్తులు ఉండడం జరిగిందని ఆ కాలనీ సిపిఐ నాయకులు సందర్శించి పరిశీలించడం జరిగిందని తెలిపారు. వెంటనే స్పందించి కాలిని



సందర్శించిన ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని. రాంభూపాల్ రెడ్డి ఉల్లి మధు దస్తగిరి ఎంపిటిసి హరినాథ్ రెడ్డి. అబ్బి పురం గ్రామ సర్పంచ్ శ్రీమతి శ్రీలక్ష్మి నాయకులు శరభారెడ్డి తదితరులు సందర్శించి వారికి భోజనాలు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని వారికి సిపిఐ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పై నాయకులు మాట్లాడుతూ... మహానంది మండలం అబ్బిపురం గ్రామ చెంచు కాలనీ ఏర్పడి దాదాపు 30 సంవత్సరాలు కావస్తున్న ఏ అధికారులు అధికార పార్టీ నాయకులు తూతూ మంత్రంలా పరిశీలించి శాశ్వత పరిష్కారాలు ఏమి చేయకుండా ఉత్తుత్తి హామీలు ఇవ్వడం జరుగుతుందని ఎన్నోసార్లు జిల్లా కలెక్టర్ కి విన్నవించిన చుంచుగుడాన్ని సందర్శించకపోవడం బాధాకరమని జిల్లాలో అన్ని చెంచు గుడాలు సందర్శిస్తున్న అబ్బిపురం చెంచుగుడానికి ఐటీడీఏలో చేర్పించి వారి ఆ దుకోవాలని వినతి లు విన్నవించిన పరిష్కంచక పోగా ఇంతవరకు చెంచు కాలనీ కి రాకపోవడం అక్కడి సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నాయని ఆవేదనతో తెలిపారు. మహానంది మండల ఎంపీపీ కుమారి యశస్విని గారికి చెంచుగుడాన్ని సందర్శించి అక్కడ సమస్యలు చెంచుగూడెం ప్రజలు విన్నవించడం జరిగిందని సమస్యలను పరిష్కరించకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో చెంచుగూడెం ప్రజలతో కలిసిఆమరణ నిరాహార దీక్షలకు సన్నద్ధమవుతా అని పై నాయకులు హెచ్చరించారు.

# అతి కష్టంగా విజయాన్ని అందుకున్న భారత్



ఆసియా కప్‌లో అత్యంత ఉత్కంఠగా జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో భారత జట్టు చెమటోడ్చింది. అతి కష్టంగా విజయాన్ని అందుకోగా.. హ్యాట్రిక్ ఓటమితో శ్రీలంక స్వదేశం చేరింది. ఆసియా కప్‌లో ఫేవరేట్ జట్టుగా బరిలోకి దిగిన భారత్‌కు వరుస భారీ షాక్‌లు ఎదురవుతున్నాయి. ఆఖరి గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో పసికూన ఒమన్ చేతిలో ఓడిపోయే మ్యాచ్‌ను కాపాడుకుని టీమిండియా పరువు నిలబెట్టుకుంది. సూపర్ 4 లో శ్రీలంకతో పోరాడి విజయాన్ని అందుకుంది. ఆసియా కప్ ఫైనల్ ముంగిట ఇలా భారత్ విపత్కర పరిస్థితులు ఎదుర్కోవడం సవాల్‌గా మారింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో ఫైనల్‌లో ఎలా ఆడుతుందోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుబాయ్‌లో జరుగుతున్న ఆసియా కప్‌లో భాగంగా సూపర్ 4లో శనివారం భారత్, శ్రీలంక బరిలోకి దిగాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ మరోసారి అర్థ సెంచరీతో చెలరేగి ఆడాడు. 31 బంతుల్లో 61 పరుగులు చేయగా.. తెలంగాణ పోరడు తిలక్ వర్మ 34 బంతుల్లో 49 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కొద్దిలో అర్థ సెంచరీని కోల్పోయాడు. సీనియర్ ఆటగాడు సంజూ శామ్‌సన్ 39 స్కోర్‌తో పర్వాలేదనిపించగా.. మిగిలిన బ్యాటర్లు తలా కొన్ని పరుగులు చేశారు. చరీత్ హసలంక, దసూన్ శనక, మహీశ్ తీక్షణ ఒక్కో వికెట్ పడగొట్టారు.భారీ లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంక అద్భుతంగా పోరాడింది. చివరి బంతి వరకు విజయం కోసం శ్రమించి స్కోర్‌ను సమం చేసింది. 20 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. పాథుమ్ నిస్సాంక సెంచరీతో దుమ్మురేపాడు. భారత బౌలర్లను ఉతికి ఆరేశాడు. 58 బంతుల్లో 107 పరుగులు చేసి నిస్సాంక అనేక రికార్డులు నమోదు చేశాడు. అతడికి తోడుగా కుశాల్ పెరెరా 32 బంతుల్లో 58 పరుగులు తీసి గొప్ప సహకారం అందించాడు. శనక 22 పరుగులతో నాటౌట్‌గా నిలిచి స్కోర్‌ను సమం చేశాడు. భారత బౌలర్లు స్కోర్‌ను కాపాడడంలో విఫలమయ్యారు. హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ ఒక్కో వికెట్ తీశారు. స్కోర్లు సమం కావడంతో సూపర్ ఓవర్ నిర్వహించగా శ్రీలంక స్కోర్ తీయడంలో విఫలమైంది. అర్ష్‌దీప్ అద్భుతంగా బౌలింగ్ చేయడం బరిలోకి దిగిన శ్రీలంక ఒక్క పరుగే చేయగా.. ఒక వైడ్‌తో మొత్తం రెండు పరుగులు చేసింది. బ్యాట్ అందుకున్న సూర్య కుమార్ తొలి బంతికే మూడు పరుగులు తీయడంతో భారత్ విజయం సాధించింది. గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ ఇంతగా పోరాడడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇప్పటికే ఫైనల్ ఆసియా కప్‌ను అందుకుంటుందని అందరూ భావిస్తుండగా పసికూన ఓమన్‌తోపాటు ఇప్పుడు శ్రీలంక నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవడంపై భారత జట్టు దృష్టి సారించాల్సి ఉంది. బౌలింగ్ దళం పటిష్టం కావాల్సి ఉంది. మరి రేపు జరగనున్న ఆసియా కప్ ఫైనల్‌లో భారత్ ఎలా ఆడుతుందనేది ఉత్కంఠ నెలకొంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో ఓడించిన భారత్ ఫైనల్‌లో కూడా అదే చేయాలని యావత్ భారతావని కోరుతోంది.

# శ్రీలంకతో మ్యాచ్‌ను ఫైనల్‌గానే భావించా...

## టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్

ఆసియా కప్ 2025 ఫైనల్‌లో భారత్, పాకిస్థాన్‌ను ఢీకొట్టేందుకు సిద్ధమైంది. అయితే అంతకుముందు జరిగిన సూపర్-4 చివరి మ్యాచ్‌లో శ్రీలంకతో తలపడింది. ఉత్కంఠగా సాగిన ఈ పోరు సూపర్ ఓవర్‌కు చేరగా భారత్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్‌కు సన్నాహకంగా భావించిన ఈ మ్యాచ్‌లో శ్రీలంక నుంచి టీమ్‌ఇండియాకు గట్టి పోటీ ఎదురైంది. ఇప్పటివరకు ఈ టోర్నీలో పెద్దగా పోటీ లేకపోవడంతో శ్రీలంక దాదాపు గెలిచేలా కనిపించింది. అయితే చివర్లో అర్ష్‌దీప్ సింగ్ వేసిన సూపర్ ఓవర్ మ్యాజిక్‌తో భారత్ విజయాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన సహచరులపై ప్రశంసలు కురిపించడమే కాకుండా, ఫైనల్ సన్నద్ధతపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌ను తాను ఫైనల్‌గానే భావించానని సూర్యకుమార్ యాదవ్ వెల్లడించాడు. "రెండో ఇన్నింగ్స్ సగం ముగిసిన తర్వాత మా ఆటగాళ్లు పుంజుకున్న తీరు అద్భుతం. దీన్ని సెమీఫైనల్‌గా ఆడాలని వారికి చెప్పా. అదే జోష్‌తో మ్యాచ్‌ను ముగించాం. బ్యాటింగ్‌లో మంచి ఆరంభం లభించాక మిడిల్ ఓవర్లలో తిలక్ వర్మ, సంజు శాంసన్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు" అని సూర్య ప్రశంసించాడు. బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అర్ష్‌దీప్‌పై ప్రత్యేకంగా మాట్లాడాడు. "అర్ష్‌దీప్ సత్తా ఏంటో మనందరికీ తెలుసు. గత మూడేళ్లుగా అతడు టాప్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ఐపీఎల్‌లోనూ అదరగొట్టాడు. అతడికంటే మరెవరు సూపర్ ఓవర్‌ను ఇంత అద్భుతంగా వేయగలరు" అని ప్రశంసల వర్షం కురిపించాడు. శ్రీలంకతో మ్యాచ్ సందర్భంగా కొందరు ఆటగాళ్లు కండరాలు పట్టేయడంతో ఇబ్బందిపడినట్లు సూర్య వెల్లడించాడు. "వారు తప్పకుండా ఆదివారం నాటి ఫైనల్ మ్యాచ్‌కు సిద్ధంగా ఉంటారని భావిస్తున్నా. శ్రీలంకతో ఎంత దూకుడుగా ఆడామో ఫైనల్‌లోనూ అదే దూకుడు ప్రదర్శిస్తాం. మా కుర్రాళ్ల నుంచి నేను కోరుకొనేది ఒక్కటే! వారి ప్రణాళికలను అనుకున్నట్లుగా అమలుచేయండి. స్పష్టతతో ఉండండి, నిర్భయంగా ఆడేయండి. ఫైనల్‌లో ఆడబోతున్నందుకు సంతోషంగా ఉంది" అని సూర్య విశ్వాసం వ్యక్తం చేశాడు.శ్రీలంక యువ ఆటగాడు దునిత్ వెల్లలాగేకు ఇటీవల పితృవియోగం కలిగింది. ఆసియా కప్‌లో ఆడుతున్నప్పుడే అతడి తండ్రి గుండెపోటుతో కన్నుమూశారు. అంత్యక్రియలకు వెళ్లి వచ్చిన దునిత్ వెంటనే జట్టుతో చేరాడు. భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడు బెంచ్‌కే పరిమితమయ్యాడు. మ్యాచ్ అనంతరం సూర్యకుమార్ యాదవ్ ప్రత్యేకంగా వెల్లలాగే వద్దకు వెళ్లి మాట్లాడి ఓదార్చాడు. సూర్య ఆడిన ఈ మాటలు, ఓదార్చే వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.దిలా ఉండగా ఆసియా కప్‌లో భాగంగా శ్రీలంకతో జరిగిన సూపర్ ఓవర్ మ్యాచ్‌లో భారత్ సత్తా చాటింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 202/5 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. అనంతరం మ్యాచ్ సూపర్ ఓవర్‌కు వెళ్లడంతో ఫలితం తేలింది. సూపర్ ఓవర్‌లో అర్ష్‌దీప్ 5 బంతుల్లో కేవలం 2 పరుగులే చేసి 2 వికెట్లు తీశాడు. ఆ తర్వాత భారత్ తరఫున బ్యాటింగ్ వచ్చిన కెప్టెన్ సూర్య కుమార్ తొలి బంతికే 3 పరుగులు చేయడంతో భారత్ విజయం సాధించింది.



# నేడు భారత్, పాకిస్థాన్ జట్లు మధ్య ఫైనల్

## జట్టు విజయానికి కీలకం కానున్న ముగ్గురు ఆటగాళ్ళు

ఆసియా కప్ చివరి దశకు చేరుకుంది. భారత్, పాకిస్థాన్ మధ్య ఈ టోర్నీ ఫైనల్ మ్యాచ్ నేడు జరగనుంది. ఈ క్రమంలో ఈ ముగ్గురు ఆటగాళ్ల బాగా ఆడితేనే పాకిస్థాన్ పై జరిగే ఆసియా కప్ ఫైనల్ లో భారత్ గెలుస్తుందని చెబుతారు. ఆసియా కప్ 2025 సిరీస్ చివరి దశకు చేరుకుంది. సెప్టెంబర్ 9న ప్రారంభమైన ఆసియా కప్ నేటితో ముగుస్తుంది. భారత్, పాకిస్థాన్ జట్లు ఫైనల్‌కు చేరిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు జరిగిన లీగ్ మ్యాచ్‌ల్లో పాకిస్థాన్ జట్టును రెండుసార్లు టీమ్‌ఇండియా మట్టికరిపించింది. బంగ్లాదేశ్, శ్రీలంక టీమ్స్ ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించాయి. నేడు జరగనున్న ఫైనల్ మ్యాచ్ లో పాకిస్థాన్‌తో టీమ్‌ఇండియా తలపడనుంది. ఈ మ్యాచ్ నేటి రాత్రి 8 గంటలకు ప్రత్యక్ష ప్రసారం కానుంది. ప్రస్తుతం జరుగుతున్న ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్ రెండుసార్లు తలపడ్డాయి. రెండు సార్లు, భారతదేశం రెండవ స్థానంలో బ్యాటింగ్ చేసి ఎటువంటి ఒత్తిడి లేకుండా సులభంగా గెలిచింది. ఈ విషయంలో భారతదేశం వరుసగా మూడవ ఆదివారం పాకిస్తాన్‌తో తలపడనుంది. ఈ సిరీస్‌లో పాకిస్తాన్ చాలా సాధారణ ప్రదర్శన కనబరిచినప్పటికీ, %u%20 మ్యాచ్‌లలో ఏదైనా జరగవచ్చు కాబట్టి ఫైనల్‌పై అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. ఆ విషయంలో భారత జట్టు గతంలో ఆడిన రెండు మ్యాచ్‌ల మాదిరిగా ఇది అంత సులభం కాదని చాలా మంది అంటున్నారు. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా గాయపడినట్లు వార్తలు వస్తున్నందున , ఎవరు ఆడతారనేది పెద్ద ప్రశ్న. అలాంటప్పుడు, రేపటి ఫైనల్‌లో భారత జట్టు విజయానికి ఈ ముగ్గురు ఆటగాళ్ళు కీలకం అవుతారు. ఆ ముగ్గురు బాగా ఆడకపోతే, భారతదేశం ఓడిపోయే అవకాశాలు పెరుగుతాయి. ఓపెనింగ్ పొజిషన్‌లో ఆడుతున్న సంజూ శామ్‌సన్, ఈ సిరీస్‌లో నంబర్ 5 ఆటగాడిగా కొత్త స్థానంలో ఆడనున్నాడు. శ్రీలంకతో జరిగిన గత మ్యాచ్‌లో తన సాధారణ దూకుడు ఆటను ఆడిన తర్వాత అతని ఆత్మవిశ్వాసం పెరిగింది. భారత జట్టు మిడిల్ ఆర్డర్ పరుగులు చేస్తేనే పాకిస్థాన్‌పై పెద్ద స్కోరు సాధించగలదు. ఛేజింగ్‌తో పాటు, పాకిస్థాన్‌ను నియంత్రించగల లక్ష్యాన్ని నిర్దేశించడం మిడిల్ ఆర్డర్ డ్యూటీ కూడా. కాబట్టి, రేపటి మ్యాచ్‌లో సంజు సామ్సన్ పెద్ద పరుగులు సాధించాల్సి ఉంటుంది. కెప్టెన్ సూర్యకుమార్ గత కొన్ని సిరీస్‌లలో స్థిరంగా ఆటను కనబరచడం లేదు. సమస్య ఏమిటంటే అతను తనకు సాధారణంగా ఉండే షాట్లను కొట్టలేకపోయాడు. అసాధారణ ఆటగాడిగా పేరుగాంచిన సూర్యకుమార్ ప్రస్తుతానికి ఆ షాట్లను కొట్టడానికి ఇబ్బంది పడుతున్నట్లు చూడటం కష్టం. టాప్ ఆర్డర్‌లో అభిషేక్, శుభ్‌మాన్ విఫలమైతే పరుగులు సాధించాల్సి వస్తుంది. సూర్యకుమార్ కూడా నిరంతరం విఫలమైతే, అది పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉంటుంది. మ్యాచ్‌లో బుమ్రా ఖచ్చితంగా ఆడతాడు. కానీ అర్ష్‌దీప్ సింగ్ ఆడటం సందేహాస్పదంగా ఉంది. భారత జట్టు ఆల్ రౌండర్‌ను వదులుకుంటేనే



అర్ష్‌దీప్ సింగ్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌లో చేర్చవచ్చు. అర్ష్‌దీప్ లేకుండా బుమ్రా మాత్రమే ఆడుతున్నట్లయితే, పవర్‌ప్లేలో బుమ్రా 3 ఓవర్లు బౌలింగ్ చేసే అవకాశం ఉంది. హార్దిక్ 1, అక్షర్ 1, బుమ్రా 3, వరుణ్ 1 కలయికతో భారత జట్టు పవర్‌ప్లేలో బౌలింగ్ చేస్తోంది. ఇందులో హార్దిక్ 2 ఓవర్లు బౌలింగ్ చేయగలడు. అదే సమయంలో, వారు శ్రీలంక మ్యాచ్‌లో పవర్‌ప్లేలో బౌలింగ్ చేయని వరుణ్ చక్రవర్తిని పవర్‌ప్లేలో బౌలింగ్ చేస్తారు. రేపు పవర్‌ప్లేలో వరుణ్ చక్రవర్తి బౌలింగ్ చేసినా చేయకపోయినా, అతను నిలకడగా పరుగులు ఇచ్చి 2-3 మిడిల్ ఆర్డర్ వికెట్లు తీస్తే, భారత జట్టు గెలవడం ఖాయం.



## భారత ఆర్చర్ శీతల్ దేవి

# స్వర్ణ పతకం

వరల్డ్ పారా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత ఆర్చర్ శీతల్ దేవి స్వర్ణ పతకం సాధించింది. ఈ విజయంతో సరికొత్త చరిత్రను లిఖించింది. సౌత్‌కొరియాలోని గ్వాంగ్జు వేదికగా జరుగుతున్న వరల్డ్ పారా ఆర్చరీ 2025 ఛాంపియన్‌షిప్‌లో మహిళల వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో శీతల్ దేవి విజేతగా నిలిచి స్వర్ణం పతకం గెలిచింది. పుట్టకతోనే చేతులు లేకున్నా.. శీతల్ దేవి కాళ్లు, నోటి సాయంతో విల్లు విసరగలదు. ఫైనల్లో వరల్డ్ నెంబర్ వన్ ప్లేయర్‌ను శీతల్ దేవి ఓడించింది. ఉత్కంఠగా సాగిన ఈ ఫైనల్లో శీతల్ దేవి 146-143 తేడాతో టర్కీకి చెందిన వరల్డ్ నంబర్ వన్ పారా ఆర్చర్ ఓజ్నూర్ క్యుర్ కీర్తిని ఓడించింది. తొలి రౌండ్ 29-29తో టై కాగా.. రెండో రౌండ్‌లో శీతల్ దేవి మూడు పర్ఫెక్ట్ 10 పాయింట్స్ సాధించి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.ఆ తర్వాత చివరి వరకు అదే ఆధిక్యాన్ని కొనసాగించింది. ఆఖరి రౌండ్‌లోనూ మూడు సార్లు 10 పాయింట్స్ సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో శీతల్ దేవి సాధించిన మూడో పతకం ఇది. గతంలో ఆమె దోమన్ కుమార్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం, సరితతో కలిసి మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో సిల్వర్ మెడల్ గెలుచుకుంది. అంతేకాకుండా 2023 వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఓస్నూర్ క్యుర్ కీర్తిపై ఎదురైన పరాజయానికి తాజా విజయంతో ప్రతీకారం తీర్చుకుంది. ఫోకోమెలియా అనే అరుదైన వ్యాధి కారణంగా చేతులు లేకుండా జన్మించిన శీతల్ దేవి ప్రయాణం స్ఫూర్తిదాయకం. 2019లో కిష్త్వార్‌లో జరిగిన యువజన కార్యక్రమంలో భారత సైన్యంలోని రాష్ట్రీయ రైఫిల్స్ ఆమె ప్రతిభను గుర్తించింది. ఆ తర్వాత అభిలాషా చౌదరి, కుల్దీప్ వాధ్వాన్ ఆధ్వర్యంలో శిక్షణను ప్రారంభించింది. తన పాదాలు, నోటిని ఉపయోగించి విల్లును విసరడం ఆమెకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. దాంతో త్వరగానే అంతర్జాతీయ స్థాయిలో ఆడే అవకాశం దక్కింది.ఆసియా పార్ గేమ్స్ 2022లో శీతల్ దేవి రెండు స్వర్ణాలు, ఒక రజత పతకం సాధించింది. పారిస్ పారాలింపిక్స్ 2024లో మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం గెలుచుకున్న అతి పిన్న వయస్కురాలిగా నిలిచింది. ఈ విజయాలతో ఆమెకు అత్యున్నత క్రీడా పురస్కారమైన అర్జున అవార్డు దక్కింది. బీబీసీ ఎమర్జింగ్ అథ్లెట్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ 2024ను కూడా శీతల్ దేవి గెలుచుకుంది.

# కుల్దీప్ యాదవ్ అద్భుతమైన ఫామ్

ప్రస్తుతం జరుగుతున్న ఆసియా కప్ 2025లో భారత స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని టీమిండియా ఈ టోర్నమెంట్‌లో అజేయంగా దూసుకుపోతోంది. ఫైనల్‌లో పాకిస్తాన్‌తో తలపడనుంది. శ్రీలంకతో జరిగిన చివరి సూపర్ ఫోర్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంలో కుల్దీప్ కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం జరుగుతున్న ఆసియా కప్ 2025లో భారత స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తన అద్భుతమైన ఫామ్‌తో అందరినీ ఆకట్టుకుంటున్నాడు. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని టీమిండియా ఈ టోర్నమెంట్‌లో ఏ ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా దూసుకుపోతోంది. ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో టైటిల్ కోసం తలపడనుంది. శ్రీలంకతో జరిగిన చివరి సూపర్ ఫోర్ మ్యాచ్‌లో బ్లూ టీమ్ ఒక సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది, అక్కడ భారత్ మూడు పరుగులు ఛేదించి విజయం సాధించింది. శ్రీలంకపై భారత్ సాధించిన ఈ విజయంలో ప్రధాన హైలైట్‌లలో ఒకటి స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ అద్భుత ప్రదర్శన. నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసిన కుల్దీప్, 31 పరుగులు ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. ఈ ప్రదర్శనతో 30 ఏళ్ల కుల్దీప్, ప్రస్తుత ఆసియా కప్ 2025లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు.ఈ మ్యాచ్‌కు ముందు కుల్దీప్, అమ్జద్ జావేద్ చెరో 12 వికెట్లతో టోర్నమెంట్‌లో సంయుక్తంగా అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌లుగా ఉన్నారు. అయితే, శ్రీలంక మ్యాచ్‌లో కుల్దీప్ తీసిన ఒక వికెట్‌తో అతని మొత్తం వికెట్ల సంఖ్య 13కి చేరుకుంది, దీంతో అతను ఇప్పుడు ఒంటరిగా టాప్ స్థానంలో ఉన్నాడు. ఫైనల్‌లో కూడా కుల్దీప్ మాయాజాలం కొనసాగితే, భారత్‌కు తిరుగుండదు.2025 ఆసియా కప్ చివరి గేమ్ అయిన శ్రీలంకపై సూపర్-ఓవర్ విజయం సాధించిన తర్వాత, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన జట్టు ప్రదర్శనపై మాట్లాడారు. ఇరు జట్లు చెరో 202 పరుగులు చేసిన తర్వాత, మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది. అక్కడ భారత్ మూడు పరుగులు ఛేదించి విజయం సాధించింది.మ్యాచ్ అనంతరం జరిగిన ప్రెజెంటేషన్ వేడుకలో సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. "ఇది ఫైనల్ మ్యాచ్ లా అనిపించింది. రెండవ ఇన్నింగ్స్‌లో ఫస్ట్ హాఫ్ తర్వాత మా అబ్బాయిలు చాలా అద్భుతమైన నైపుణ్యాన్ని చూపించారు. దీన్ని సెమీ-ఫైనల్ లాగా ఆడమని వారికి చెప్పాను. అందరినీ దగ్గరగా ఉంచండి, మంచి ఎనర్జీతో ఆడండి, ఆపై ఏం జరుగుతుందో చూద్దాం అన్నాను. విజయం సాధించినందుకు సంతోషంగా ఉంది" అని అన్నారు. సూర్యకుమార్ మాటలు జట్టులో ఉన్న ఆత్మవిశ్వాసాన్ని, చివరి వరకు పోరాడే స్ఫూర్తిని స్పష్టం చేస్తున్నాయి.



# ది ప్యారడైజ్ మూవీలో మోహన్‌బాబు

కథానాయకుడు నాని – దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మరోసారి ది ప్యారడైజ్ మూవీలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. 'ది ప్యారడైజ్' అంటూ విభిన్న కథతో రానున్నారు. ఈ సినిమాలో అగ్ర నటుడు మోహన్ బాబు ఉన్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన లుక్‌ను రిలీజ్ చేశారు. ఇందులో మోహన్‌బాబు 'శికంజ మాలిక్'గా కనిపించనున్నట్లు తెలుపుతూ పోస్టర్ విడుదల చేశారు. షర్ట్ లేకుండా గన్, కత్తి పట్టుకుని సిగార్ కాలుస్తూ రగ్గడ్ లుక్‌లో మోహన్‌బాబు కనిపిస్తున్నారు. ఆయన పవర్‌ఫుల్ విలన్‌గా నటిస్తున్నట్లు– చిత్రబృందం తెలిపింది. ఇక ఇందులో నాని కూడా ఇప్పటివరకూ చూడని డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్న విషయం తెలిసిందే. నాని 'జడల్' పాత్రలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది మార్చి 26న ఈ సినిమా ప్రేక్షకులను పలకరించనుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీతోపాటు–... మొత్తం 8 భాషల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. తిరుగుబాటు–, నాయకత్వంతో పాటు– తల్లీకొడుకుల అనుబంధం కథకు కీలకంగా నిలవనున్నట్లు– ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతుంది.







# గాడ్ ఆఫ్ ఫియర్... దేవర-2 పై అధికారిక ప్రకటన

యంగ్ –టైగర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన చిత్రం దేవర. గతేడాది సెప్టెంబర్ 27న రిలీజ్ అయిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి కొరటాలకు సూపర్ కంబ్యాక్ సినిమాగా నిలిచింది. అలాగే బాలీవుడ్ హాట్ బ్యూటీ– జాన్వీ కపూర్ కు టాలివుడ్ లో తొలి సినిమాతోన బ్లాక్ బస్టర్ ను తన ఖాతలో వేసుకుంది. రాజమౌళి సెంటిమెంట్ ను సైతం బ్రేక్ చేసిన హీరోగా ఎన్టీఆర్ సెన్సేషన్ చేసారు. కాగా ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందని గతంలోనే ప్రకటించారు. అయితే ఎన్టీఆర్ లైనప్ ను పరిశీలిస్తే దేవర 2 ఉండదనే చర్చ నడిచింది. కానీ ఎట్టి పరిస్థితుల్లో దేవర 2 ఉంటుందని ప్రకటించడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అయ్యారు. ఇదిలా ఉండగా నేడు ఈ సినిమా రిలిజ్ అయి సంవత్సరం అయిన సందర్భంగా దేవర 2 గురించి కీలక ప్రకటన చేసారు మేకర్స్. ఈ సారి గాడ్ ఆఫ్ ఫియర్ రాబోతున్నాడు దేవర 2 కు రెడీ అవండి అని అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ఈ ప్రకటనతో నందమూరి ఫ్యాన్స్ జోష్ రెట్టింపయింది. ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఆ తర్వాత జైలర్ డైరెక్టర్ నెల్సన్ తో సినిమా చేయాల్సి ఉంది. అలాగే త్రివిక్రమ్ తో కూడా సినిమా చేయబోతున్నాడు. మరి ఈ గ్యాప్ లో దేవర 2 ను ఎన్టీఆర్ ఎప్పుడు స్టార్ట్ చేస్తాడో చూడాలి. మరోవైపు దర్శకుడు కొరటాల దేవర 2 స్క్రిప్ట్ వర్క్ ను ఫినిష్ చేసే పనిలో ఉన్నాడు.



# ఈ అవకాశం కలలో కూడా ఊహించలేదు

## కాంతారా చాప్టర్-1 నటి రుక్మిణీ వసంత్

'కాంతార చాప్టర్ 1'లో నటించే అవకాశం వస్తుందని నేను కలలో కూడా ఊహించలేదని నటి రుక్మిణీ వసంత్ అన్నారు. 'కాంతార చాప్టర్ 1'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటి రుక్మిణి వసంత్. రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం అక్టోబర్ 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. నేను నటించిన 'సప్తసాగరాలు దాటి', 'ఏస్' చిత్రాలను రిషబ్ శెట్టి చూశారు. వాటి ప్రీమియర్స్‌కు వచ్చి నా నటనను మెచ్చుకున్నారు. ఇదంతా ఆయన నా ప్రీమియర్స్ చూసి ఇందులో ఛాన్స్ ఇచ్చారని నేను భావిస్తున్నా. కాంతార టీ–మ్ నాకు ఫోన్ చేసి ఇందులో భాగం అవుతారా అని అడిగినప్పుడు నా ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను. ఈ సినిమా 4,5 శతాబ్దాల మధ్య జరిగే కథ. అప్పటి పరిస్థితులకు తగినట్లు– వాటిని అర్థం చేసుకుంటూ నటించాలి. అలాగే దీనికోసం గుర్రపు స్వారీ, కత్తి యుద్ధంలలో శిక్షణ పొందడం ఎంతో సరదాగా అనిపించింది. కొన్ని యాక్షన్ సన్నివేశాలు చేశానని రుక్మిణి తెలిపారు. కొన్ని సందర్భాల్లో రిషబ్ శెట్టిని చూసి ఆశ్చర్యపోయినట్లు– తెలిపారు. నటు–డిగా, దర్శకుడిగా ఆయన ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలిస్తారని ప్రశంసలు కురిపించారు. ఇక తాను ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబోలో రానున్న సినిమా, యశ్ టాక్సిక్ గురించి ఇప్పుడే ఏం చెప్పలేనని అన్నారు. తాను కెరీర్‌లో ఏ ఆఫర్‌నూ వదులుకోలేనని చెప్పారు.

# శరవేగంగా లెనిన్ చిత్రీకరణ

## శ్రీలీల ప్లేస్‌లో భాగ్యశ్రీ బోర్సే

అఖిల్ అక్కినేని హీరోగా వస్తున్న చిత్రం లెనిన్. వినరో భాగ్యం విష్ణు కదా ఫేమ్ మురలీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ బ్యానర్ పై నాగవంశీ నిర్మిస్తున్నారు. ఆ మధ్య రిలీజ్ లెనిన్ గ్లిమ్స్ సినిమాపై ఆడియెన్స్ లో క్యూరియాసిటిని పెంచింది. అలాగే ఈ సినిమాలో హీరోయిన్ గా మొదట శ్రీలీలను తీసుకున్నారు మేకర్స్. కొంత పోర్షన్ షూటింగ్ కూడా చేసారు. కానీ బాలీవుడ్ సినిమా కోసం లెనిన్ కు డేట్స్ ఇవ్వడంలో డిలే చేస్తుండడంతో ఆమెను ఈ సినిమా నుండి తప్పించి ఆ పోర్షన్ ను రీ షూట్ చేసారు మేకర్స్. శ్రీలీలతో కేవలం ఎనిమిది రోజుల షూట్ మాత్రమే చేసారు. ఆమె ప్లేస్ లో భాగ్యశ్రీ బోర్స్ ని అఖిల్ సరసన హీరోయిన్ గా తీసుకున్నారు. భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న ఈ యాక్షన్ డ్రామా ఇప్పటికే 80శాతం షూటింగ్ పూర్తయింది, చివరి షెడ్యూల్ ఈ నెలలో ప్రారంభమవుతుంది. –క్లైమాక్స్ సన్నివేశాలతో పాటు– ప్యాచ్ వర్క్ ను అక్టోబర్ నాటికి ఫినిష్ చేసేలా షెడ్యూల్ ప్లాన్ చేసారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఏడాది రిలీజ్ చేయాలని భావిస్తున్నారు. వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఈ ఏడాది నవంబరు 17న లెనిన్ ను రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నట్టు– తెలుస్తోంది. అందుకు అనుగుణంగానే షూటింగ్ ను జెట్ స్పీడ్ లో చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమాతో ఎలాగైనా హిట్ కొట్టాలని అఖిల్ పట్టుదలగా ఉన్నాడు.

------



# ట్రిపుల్ ఎక్స్..సీక్వెల్‌లో దీపికా పడుకొణె

తుపాకులు.. అమ్మాయిలు.. రెండూ ఒకటే. ధైర్యంగా ప్రపంచాన్ని ఎదుర్కొంటాయి అంటూ 'ట్రిపుల్ ఎక్స్: రిటర్న్ ఆఫ్ జాండర్ కేజ్' అనే తన తొలి హాలీవుడ్ సినిమాతో అదరగొట్టింది బాలీవుడ్ తార దీపికా పదుకొణె. డీజే కరుసో తెరకెక్కించారు. ఈ స్పై యాక్షన్ చిత్రంలో విన్ డీసెల్, నినా డోబ్రేవ్, రూబీ రోజ్
తదితరులు కీలక పాత్రలు పోషించారు. 2017లో విడుదలై భారీ వసూళ్లతో రికార్డు సృష్టించిన ఈ సినిమాకు ఇప్పుడు సీక్వెల్ రాబోతున్నట్లు– తెలుస్తోంది. ఇందులో కూడా దీపికా పదుకొణె భాగం కానున్నట్లు– సమాచారం. ఈ కొనసాగింపు సినిమా చిత్రీకరణను దీపిక కోరిక మేరకు ముంబయిలో ప్రారంభించాలని సన్నాహాలు చేస్తుంది చిత్రబృందం. తన కుమార్తె కోసం ఆమె ఈ నిర్ణయం తీసుకుంది. త్వరలో దీనికి సంబంధించిన వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నారని దీపిక సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి మరోసారి హాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్న ఆమె సందడి ఎలా ఉంటుందో చూడాలంటే కొన్ని రోజులు ఎదురుచూడాల్సిందే.



# 'కాంతార' వేడుకకు ఎన్టీఆర్.. హైదరాబాద్ లో గ్రాండ్ ఈవెంట్

పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలతో వస్తున్న 'కాంతార: ఏ లెజెండ్' చిత్రం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. కన్నడలో సంచలనం సృష్టించిన 'కాంతార'కు ప్రీక్వెల్ గా వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో తెలుగు ప్రేక్షకులకు ఓ అదిరిపోయే అప్డేట్ ను చిత్రబృందం అందించింది. ఈ సినిమా తెలుగు ప్రీ రిలీజ్ వేడుకకు 'మ్యాన్ ఆఫ్ మాసెస్' జూనియర్ ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు అధికారికంగా ప్రకటించింది.హైదరాబాద్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ వేదికగా రేపు (ఆదివారం) సాయంత్రం 5 గంటలకు ఈ ఈవెంట్ ను గ్రాండ్‌గా నిర్వహించనున్నారు. ఇటీవలే రెబల్ స్టార్ ప్రభాస్ చేతుల మీదుగా ఈ సినిమా తెలుగు ట్రైలర్ విడుదల కాగా, ఇప్పుడు ప్రీ రిలీజ్ వేడుకకు ఎన్టీఆర్ వస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. ఈ ఈవెంట్ తో సినిమా ప్రచారం తెలుగు రాష్ట్రాల్లో మరో స్థాయికి చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

